

దొంగతనాలకు పాల్పడిన వ్యక్తి అరెస్టు 7లో

ఇరువర్గాల కొట్లాటలో 20 మందిపై కేసులు

మళ్లీ అన్నదాతల్లో ఆందోళన



ఉప్పలగుప్తంలో వాతావరణం మారడంతో పంటను రక్షించుకునేందుకు తిప్పలు పడుతున్న రైతులు

ఉప్పలగుప్తం, డిసెంబరు 8: ఫెంగల్ ప్రభావం నుంచి ఇప్పుడిప్పుడే బయటపడి సార్వా పైరును గట్టుకు చేర్చుకుంటున్న రైతుల పరిస్థితి మళ్లీ మొదటికొచ్చింది. ఆదివారం ఆకాశం మేఘావృతం కావడంతో రైతులు దిగాలు పడ్డారు. పొలాల్లోని పైరును గట్టుకు చేర్చుకునేందుకు ప్రయత్నాలు ప్రారంభించారు. వాతావరణం బాగుందని వరి కోతలు ప్రారంభించిన రైతులకు మళ్లీ తుఫాను వణుకు మొదలయ్యింది. ఆదివారం మండలంలోని పలు ప్రాంతాల్లో రైతులు నీటిలో ఉన్న పైరును ఒబ్బిడి చేసేందుకు తమ వంతు ప్రయత్నాలు చేస్తున్నారు. ఇప్పటికే పైరు చేలల్లో మొలకెత్తడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. మళ్లీ వర్షం కురిస్తే పొలాల్లోని సార్వా పంటకు నీళ్లొదులు కోవాల్సిందేనని రైతులు భయపడుతున్నారు.



గొల్లవిల్లిలో మొలకెత్తుతున్న తీరును చూపిస్తున్న రైతు



కాకినాడ జేఎన్‌టీయూలో ఎమ్మెల్సీ కౌంటింగ్‌కు ఏర్పాట్లు చేస్తున్న సిబ్బంది



పల్లకిలో పెళ్లిజంట

అల్లవరం, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): అల్లవరంలో బ్యాండు మేళతాళాల నడుమ పల్లకిలో పెళ్లి జంట సందడి చేసింది. వెదుళ్లపల్లి సుబ్రహ్మణ్యం వినయ్‌కుమార్‌-శ్రీఅమృత వివాహ మహోత్సవం సందర్భంగా పల్లకిలో ఊరేగారు. అల్లవరం, అమలాపురం, పెనుగొండ ప్రాంతాలకు చెందిన ఆర్యవైశ్య సంఘ నాయకులు, యువకులు పల్లకి ఊరేగింపులో పాల్గొన్నారు.

నేడు గ్రీవెన్స్‌ యథాతథం

అమలాపురం టౌన్‌, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదిక గ్రీవెన్స్‌ కార్యక్రమం సోమవారం ఉదయం 10 గంటల నుంచి కలెక్టరేట్‌లోని గోదావరి భవన్‌లో యథావిధిగా జరుగుతుందని కలెక్టర్‌ ఆర్‌.మహేష్‌కుమార్‌ ఓ ప్రకటనలో తెలిపారు. అర్జీదారులు తమ సమస్యలను జిల్లా యంత్రాంగం దృష్టికి తీసుకువచ్చి పరిష్కార మార్గాలు పొందాలని విజ్ఞప్తి చేశారు. జిల్లాస్థాయితో పాటు డివిజన్‌, మండలస్థాయిల్లో గ్రీవెన్స్‌ కార్యక్రమం కొనసాగుతుందన్నారు.



దత్త జయంతి సప్తాహ మహోత్సవాలు ప్రారంభం 7లో

నిద్రమత్తులో ట్రక్కు నుంచి జారిపడి వ్యక్తి మృతి 7లో

లక్ష్యం వైపు గురి

ఉత్సాహంగా ఆర్చరీ పోటీలు





అమలాపురం టౌన్‌, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాస్థాయి సబ్‌ జూనియర్‌ ఆర్చరీ పోటీలు అమలాపురం సర్‌ సీవీ రామన్‌ పబ్లిక్‌ స్కూల్‌లో ఆదివారం నిర్వహించారు. రవణం రాంబాబు మెమోరియల్‌ ట్రస్టు ఆధ్వర్యంలో ఆర్చరీ అసోసియేషన్‌ ఉమ్మడి జిల్లాశాఖ పర్యవేక్షణలో ఈ పోటీలను నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి ఆర్చరీ క్రీడాకారులు తరలివచ్చి తమ క్రీడా ప్రతిభను చాటుకున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు హోరాహోరీగా ఈ పోటీలు జరిగాయి. ఆర్చరీ పోటీలను జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్‌ ఎస్కే సలీంబాషా, క్రీడా భారతి అసోసియేషన్‌ అధ్యక్ష, కార్యదర్శులు అల్లాడ శరత్‌బాబు, పప్పుల శ్రీరామచంద్రమూర్తి ప్రారంభించారు. ఆర్చరీ అసోసియేషన్‌ ప్రధాన కార్యదర్శి పల్లా లక్ష్మణరావు, అధ్యక్షుడు జొన్నలగడ్డ గోపాలకృష్ణ పర్యవేక్షణలో పోటీలను మూడు భాగాలుగా నిర్వహించారు. ఆయా పోటీల విజేతలను క్రీడాభారతి ప్రతినిధి రంకిరెడ్డి కాశీవిశ్వనాథం, స్కూల్‌ డైరెక్టర్‌ రవణం వేణుగోపాల్‌ ప్రకటించారు. ఉమ్మడి జిల్లాస్థాయి నుంచి ప్రతిభ కనబరిచిన 27 మంది ఆర్చరీ క్రీడాకారులను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేసినట్టు ప్రకటించారు. విజేతలైన క్రీడాకారులకు సర్టిఫికెట్లను జిల్లా అసోసియేషన్‌ ఆధ్వర్యంలో అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్‌ నిమ్మన శ్రీనివాస్‌, ఆర్గనైజర్‌ కుడుపూడి బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

23 నుంచి రాష్ట్రస్థాయి పోటీలు

ఈ నెల 23 నుంచి 25వ తేదీ వరకు రాజమహేంద్రవరంలో రాష్ట్రస్థాయి సబ్‌జూనియర్‌ ఆర్చరీ పోటీలు నిర్వహిస్తాం. రాష్ట్ర ఆర్చరీ అసోసియేషన్‌, ఉమ్మడి జిల్లా అసోసియేషన్‌ సంయుక్త ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి పోటీలు జరుగుతాయి. అమలాపురంలో నిర్వహించిన ఆర్చరీ పోటీల్లో 27 మందిని రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేశాం. రాష్ట్రస్థాయిలో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను జాతీయస్థాయి పోటీలకు ఎంపిక చేస్తాం. రాజస్థాన్‌లోని జైపూర్‌లో 2025 జనవరి 3 నుంచి 10వ తేదీ వరకు జాతీయస్థాయి ఆర్చరీ పోటీలు జరుగుతాయి.

పి.లక్ష్మణరావు, ఉమ్మడి జిల్లా ఆర్చరీ అసోసియేషన్‌ ప్రధాన కార్యదర్శి





రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన ఆర్చరీ క్రీడాకారులతో నిర్వాహకులు

మా..స్టారొస్తారు!

ఎమ్మెల్సీ ఫలితం తేలేది నేడే

- ఉదయం 8 నుంచి లెక్కింపు
- బరిలో ఐదుగురు అభ్యర్థులు
- ఇద్దరి మధ్య ప్రధాన పోటీ
- పోలైన ఓట్లు 15,490
- బ్యాలెట్‌ ఓట్ల లెక్కింపు వల్ల ఆలస్యంగా ఫలితం

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

మా..స్టారెవరో మరికొన్ని గంటల్లో తేలిపోనుంది.. ఇప్పటికే ఫలితం బాక్సుల్లో భద్రంగా ఉంది.. నేటి లెక్కింపుతో ఉత్కంఠకు తెరపడుతుంది. ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల టీచర్స్‌ నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నిక ఓట్ల లెక్కింపు కాకినాడ జేఎన్‌టీయూలో సోమవారం ఉదయం 8 గంటల నుంచి ఆరంభమవుతుంది. బ్యాలెట్‌ పత్రాల లెక్కింపు వల్ల కౌంటింగ్‌ కాస్త నెమ్మదిగా జరగవచ్చు.ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాల్లో మొత్తం 16,737 మంది ఓటర్లు ఉండగా 15,502 ఓట్లు పోలయ్యాయి.అది 92.62 శాతంగా ప్రకటించారు. కానీ ఈ రోజు ప్రకటనలో పోలైన ఓట్లు 15,490గా చెబుతున్నారు.12 ఓట్లు తేడా వచ్చింది.యూటీఎఫ్‌కు చెందిన ఎమ్మెల్సీ షేక్‌ సాబ్జీ గతేడాది ఉండి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందడంతో ఈ ఉప ఎన్నిక అనివార్యమైంది. దీంతో మొత్తం ఐదుగురు అభ్యర్థులు స్వతంత్రంగా పోటీపడ్డారు. యూటీఎఫ్‌ నేత బొర్రా గోపీమూర్తి, గంధం నారాయణరావు, పులుగు దీపక్‌, డా.కవల నాగేశ్వరరావు, నామన వెంకటలక్ష్మి(విళ్ల లక్ష్మి) పోటీ పడ్డారు. కానీ పోటీ ప్రధానంగా బొర్రా గోపీమూర్తి, గంధం నారాయణరావు మధ్యే ఉంటుందనే ఆయా వర్గాల కథనం. ప్రభుత్వ ఉపాధ్యాయులు ఎక్కువగా గోపీమూర్తికి వేయగా, ప్రైవేట్‌ స్కూళ్ల నుంచి నారాయణరావుకు ఓట్లు బాగా పడినట్టు ప్రచారం జరుగుతోంది. ఉపాధ్యాయ నియోజకవర్గం ఎన్నికలంటే చాలా ప్రాధాన్యత ఉంటుంది. గతంలో కార్పొరేట్‌ విద్యాసంస్థల యజమానులు పోటీ చేసి గెలిచిన సందర్భాలు ఉన్నాయి.ఈ సారి పోటీ రసవత్తరంగానే సాగినట్టు చెప్పవచ్చు. మిగతా అభ్యర్థులు కొంతమేర ఓట్లను చీల్చే అవకాశం ఉంది. వైసీపీ ఐదేళ్లలో టీచర్ల నోళ్లను వైసీపీ ప్రభుత్వం నొక్కేసిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో శాసన మండలిలో తమ తరపున మాట్లాడడానికి ఉపాధ్యాయ వృత్తి నుంచి వచ్చిన ఉద్యమ నేతకే పట్టం కట్టాలని కొన్ని సంఘాలు భావించాయి.ఈ ఎన్నికల్లో ప్రధాన రాజకీయ పార్టీలు అభ్యర్థులను పోటీకి పెట్టలేదు. ఇక్కడ సీపీఐ మాత్రం ఎస్టీయు సంఘం తరపున గంధం నారాయణరావుకు సపోర్టు చేయడం గమనార్హం. పార్టీలకతీతంగా ఎన్నికలు జరగడంతో పెద్దగా ప్రచార ఆర్భాటం కనిపించని సంగతి తెలిసిందే.గెలుపు ఎవరిదనే దానిపై ఎవరి ధీమా వారికి ఉంది.

14 టేబుళ్లపై.. 9 రౌండ్లలో లెక్కింపు

కలెక్టరేట్‌(కాకినాడ), డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): తూర్పు-పశ్చిమగోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నియోజకవర్గ ఓట్ల లెక్కింపుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తూర్పు-పశ్చిమగోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నియోజకవర్గ ఆర్వో కాకినాడ జిల్లా కలెక్టర్‌ షాన్‌మోహన్‌ తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈనెల 5న తూర్పు-పశ్చిమగోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల నియోజకవర్గం సంబంధించిన పోలింగ్‌ ప్రక్రియ జరిగిందన్నారు. ఈ పోలింగ్‌ ప్రక్రియలో 15,490 ఓట్లు నమోదయ్యాయన్నారు. బ్యాలెట్‌ బాక్స్‌లను కాకినాడ జేఎన్‌టీయూ డాక్టర్‌ బీఆర్‌ అంబేడ్కర్‌ సెంట్రల్‌ లైబ్రరీ గ్రౌండ్‌ ఫ్లోర్‌లో భద్రపరిచామన్నారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియ సోమవారం ఉదయం 8 గంటల నుంచి ప్రారంభమవుతుందన్నారు. కౌంటింగ్‌ సిబ్బందికి శిక్షణ పూర్తి చేశామన్నారు.కౌంటింగ్‌ సిబ్బంది, ఏజెంట్లు ఉదయం 6గంటలకే కౌంటింగ్‌ కేంద్రానికి చేరుకోవాలన్నారు. 14 టేబుళ్లపై 9రౌండ్‌లో ఓట్ల లెక్కింపు ప్రక్రియ జరుగుతుందన్నారు. భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాలు దృష్టిలో పెట్టుకుని ఓట్ల లెక్కింపు చేపడతామన్నారు. తొలిదశలో ప్రాథమిక ఓట్ల లెక్కింపు పూర్తయిన అనంతరం డీటెయిల్డ్‌ కౌంటింగ్‌ నిర్వహించామన్నారు.

కౌంటింగ్‌కు డ్రోన్‌ కెమెరాలతో పటిష్ట నిఘా : ఎస్పీ

కాకినాడక్రైం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జేఎన్‌టీయూకేలో స్ట్రాంగ్‌ రూమ్‌, కౌంటింగ్‌ కేంద్రాలను ఎస్పీ విక్రాంత్‌ పాటిల్‌ ఆదివారం పరిశీలించారు. ఎలక్షన్‌ అధికారులు, పోలింగ్‌ ఏజెంట్ల సెల్‌ఫోన్లను బయట సెల్‌ఫోన్‌ కౌంటర్లలో జమ చేసి లోనికి వెళ్లాలని సూచించారు. డ్రోన్‌ కెమెరాలను వినియోగిస్తూ పటిష్ట నిఘా ఏర్పాటు చేసినట్టు ఎస్పీ తెలిపారు. వాహనాల పార్కింగ్‌ ఏర్పాట్లను కూడా పరిశీలించారు.



స్ట్రాంగ్‌ రూమ్‌ను పరిశీలిస్తున్న ఎస్పీ

ప్రశాంతంగా జాతీయ ఉపకార వేతన పరీక్ష

పరీక్షా కేంద్రాలను తనిఖీ చేసిన డీఈవో



పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న డీఈవో సలీంబాషా

అమలాపురం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని 13 కేంద్రాల్లో ఆదివారం జాతీయ ఉపకార వేతన పరీక్షను నిర్వహించగా ప్రశాంతంగా ముగిసింది. జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్‌ షేక్‌ సలీంబాషా జిల్లాలోని పలు పరీక్షా కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. జిల్లా వ్యాప్తంగా 2815 మందికి గాను 2688 మంది ఎన్‌ఎంఎంఎస్‌ పరీక్షకు హాజరయ్యారు. 127 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. డీఈసీబీ కార్యదర్శి బీర హనుమంతరావు తెలిపిన వివరాల ప్రకారం అమలాపురం కేంద్రంగా జిల్లా పరిషత్‌ బాలికోన్నత పాఠశాలలో 216 మందికి గాను 199 మంది హాజరుకాగా 17 మంది గైర్హాజరయ్యారు. అదే విధంగా బాలుర ఉన్నత పాఠశాలలో 11 మంది, మహాత్మాగాంధీ మున్సిపల్‌ హైస్కూలులో 13 మంది, కొంకాపల్లి జవహర్‌లాల్‌ నెహ్రూ మున్సిపల్‌ ఉన్నత పాఠశాలలో 12 మంది, విద్యానిధి ఐటీ స్కూల్‌లో 15 మంది, పేరూరు జడ్పీహెచ్‌ఎస్‌లో 15 మంది, కొత్తపేట ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో 9 మంది, భాష్యం ఇంగ్లీషు మీడియం స్కూలులో 9 మంది, క్రాంతి భారతి జూనియర్‌ కళాశాలలో ఐదుగురు, వాడపాలెం జడ్పీహెచ్‌ఎస్‌లో ఆరుగురు, రత్నంపేటలో ఐదుగురు, రామచంద్రపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏడుగురు, చాకలిపాలెం హైస్కూలులో ముగ్గురు విద్యార్థులు గైర్హాజరయ్యారని వివరించారు. ఆయా పరీక్షా కేంద్రాలను ఉప విద్యాశాఖాధికారి గుబ్బల సూర్యప్రకాశం, ఏఎంవో పి.రాంబాబు పర్యవేక్షించారు.

ఎన్నాళ్లు భరించాలి ఈ కంపు..



అమలాపురం రూరల్‌, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి):

బండారులంక గ్రామ పంచాయతీలో రెండు నెలల 15 రోజులుగా చెత్త సేకరణ నిలిచిపోయింది. దాంతో గ్రామంలో ఏ ఇంటి ముందు చూసినా.. ఏ వీధిలో చూసినా చెత్తకుప్పలే దర్శనమిస్తున్నాయి. నెలల తరబడి చెత్తకుప్పలు పేరుకుపోవడంతో కుళ్లి దుర్వాసన వస్తోంది. దోమల బెడద విపరీతంగా పెరిగిపోయింది. దోమల బెడదతో కంటి మీద కునుకు లేకుండా గడపాల్సిన పరిస్థితి. కొన్ని కుటుంబాల వారు అయితే వారానికి ఓ సారి చెత్తను రోడ్లపై పోసుకుని తగలబెట్టేస్తున్నారు. రోడ్లపైనే చెత్తకుప్పలు తగలబెట్టడం వల్ల రహదారి పొడవునా దట్టమైన పొగ వ్యాపించడంతో వాహనదారులు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఇదెంత ప్రమాదకరమో తెలిసినా అడిగేవారు లేరు. పట్టించుకునేవారు లేరు. ఇంత జరుగుతున్నా అధికారులు, పాలకులు చోద్యం చూస్తున్నారు.



బండారులంకలో దారిపొడవునా పేరుకుపోయిన చెత్తకుప్పలు

- బండారులంక దారి పొడవునా చెత్తకుప్పలే
- రెండు నెలల పైబడి ఇదే పరిస్థితి
- పెరిగిపోయిన దోమల ఉధృతి
- దుర్వాసన వెదజల్లుతున్న పరిసరాలు

సమస్యను పరిష్కరించేది ఎవరు?

ప్రజారోగ్యం పూర్తిగా దెబ్బతినక ముందే చెత్త సమస్య పరిష్కారం అవుతుందో లేదో అన్న ఆందోళన గ్రామస్తుల్లో నెలకొంది. దాంతో పంచాయతీ ఆధ్వర్యంలో గత మూడు రోజులుగా ప్రతీ వీధిలోను ఇంటింటా బ్లీచింగ్‌, ముగ్గు చల్లే కార్యక్రమం చేపట్టి చేతులు దులుపేసుకున్నారు. చెత్త సేకరణకు వినియోగించే ట్రాక్టర్లు, ఇతర వాహనాలు పంచాయతీ కార్యాలయం ముందు నెలల తరబడి సేదదీరుతున్నాయి. పారిశుధ్య కార్మికులు మాత్రం ఎక్కడికక్కడ పేరుకుపోయిన చెత్తకుప్పలను క్రమబద్ధీకరించే పనులకు పరిమితమయ్యారు.

వినతులు అందించినా..

చెత్త సమస్య పరిష్కరించాలని ఇప్పటికే ఒక వర్గానికి చెందినవారు జిల్లా కలెక్టర్‌ ఆర్‌.మహేష్‌కుమార్‌, మంత్రి వాసంశెట్టి సుభాష్‌, ఎంపీ గంటి హరీష్‌మాధుర్‌, ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు దృష్టికి తీసుకువెళ్లారు. అయినా ఇంత వరకు పరిష్కారానికి నోచుకోలేదు సరికదా కనీసం ఎప్పటికి పరిష్కారమవుతుందో చెప్పగలిగే అధికారే లేరు. గత నెలలో మాత్రం పోలీసులు, రెవెన్యూ అధికారులతో కలిసి పంచాయతీ సిబ్బంది చెత్త సేకరణ పనులు చేపట్టినా ఒక్క పూటలోనే రాజకీయ కారణాలతో నిలిచిపోయింది. చెత్త సమస్య పరిష్కారం కోసం గ్రామంలోని నాయకులు రాష్ట్రస్థాయి అధికారుల వద్దకు వెళ్లాలా, నేరుగా ముఖ్యమంత్రి కార్యాలయానికి వెళ్లాలా అని తర్జనభర్జన పడుతున్నారు. ఇదిలా ఉండగా పంచాయతీ గ్రామసభ ద్వారా తీర్మానం చేసిన ప్రాంతంలో ఎందుకు చెత్త వేయకూడదు అనే అంశంపై హైకోర్టును ఆశ్రయించడానికి మరికొందరు సన్నద్ధమవుతున్నారు. న్యాయం ఎవరి పక్షాన నిలుస్తుందో తెలియదు గానీ చెత్త సమస్యతో ప్రజారోగ్యం మాత్రం దెబ్బతినడం ఖాయమని వైద్య ఆరోగ్యశాఖ అధికారులు సైతం ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

గ్రామస్థుల మండిపాటు

గ్రామంలో ఇన్ని రోజులుగా చెత్త సమస్య ఉన్నప్పటికీ ఒక్కరికి కూడా చీమకుట్టినట్టు కూడా లేకపోవడంతో గ్రామస్థులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తమను చెత్తకు అప్పగించి వదిలేశారని మండిపడుతున్నారు. శాశ్వత చర్యలు తీసుకుని చెత్త నుంచి తమకు పూర్తిస్థాయిలో రక్షణ కల్పించాలని పలువురు కోరుతున్నారు.

వైభవంగా శ్రీ పుష్పయోగ మహోత్సవం

అన్నవరంలో ముగిసిన సుబ్రహ్మణ్యేశ్వరుడి దివ్య కల్యాణోత్సవాలు



పుష్పోత్సవంలో నవదంపతులు

అన్నవరం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా అన్నవరంలో కొలువైయున్న సుబ్రహ్మణ్యేశ్వరుడి దివ్య కల్యాణోత్సవాలు ఆదివారంతో ముగిశాయి. రాత్రి 7గంటలకు పండితులు ఆధ్వర్యంలో శ్రీపుష్పయోగ మహోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. ముందుగా నవ దంపతులైన శ్రీవల్లీ, దేవసేన, సుబ్రహ్మణ్యేశ్వరులను ప్రత్యేకంగా సుగంధభరిత పుష్పాలతో అలంకరించిన ఊగుటూయలలో ఆశీనులు గావించి గణపతిపూజ, పుణ్యాహవచనం, పుష్పోత్సవం నిర్వహించారు. విశేషమైన మధురఫలాలు, తీపిపదార్థాలను నవదంపతదులకు నివేదించి దంపతీతాంబూలాలు అందించారు. అనంతరం చతుర్వేదపండితుల వేదాశీర్వచనాలు అనంతరం ఏకాంతసేవ నిర్వహించారు.



కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

బిక్కవోలులో కనుల పండువగా రథోత్సవం

వైభవంగా శ్రీకుమార సుబ్రహ్మణ్యేశ్వరస్వామి షష్ఠి ఉత్సవాలు



బిక్కవోలులో శ్రీకుమార సుబ్రహ్మణ్యేశ్వరస్వామివారు, మెయిన్‌రోడ్‌లో రథాన్ని లాగుతున్న భక్తులు

బిక్కవోలు, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): తూర్పు గోదావరి జిల్లా బిక్కవోలు శ్రీకుమారసుబ్రహ్మణ్యేశ్వరస్వామి షష్ఠి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం స్వామివారి రథోత్సం కనుల పండువగా నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్ఛారణలు, బ్యాండు మేళాల మధ్య ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి మహాలక్ష్మి దంపతులు, ఉత్సవ కమిటీ అధ్యక్షుడు పల్లి శ్రీనివాసరెడ్డి రథాన్ని లాగి ఉత్సవాన్ని ప్రారంభించారు. రథం ముందు బిక్కవోలు శ్రీకుమారసుబ్రహ్మణ్యస్వామి కోలాట మండలి సభ్యుల కోలాటం, బ్యాండ్ కచేరిలు, కేరళ వాయిద్యాలు అందర్నీ అలరించాయి. స్వామివారి రథం వంగా వారి వీధి నుంచి మెయిన్‌రోడ్ మీదుగా రాజారావుపేట, గ్రామంలోని పురవీధుల గుండా సాగింది. అధిక సంఖ్యలో భక్తులు రథాన్ని లాగడానికి పోటీపడ్డారు. కార్యక్రమంలో లక్ష్మీగణపతి ఆలయ చైర్మన్ చాగంటి సాయిబాబారెడ్డి, కమిటీ సభ్యులు పాలచర్ల శివ ప్రసాద్‌చౌదరి, వంగా పుల్లా రెడ్డి, తొండాపు శ్రీనివాసరెడ్డి, మానుకొండ రాంబాబు, నందిపాటి కిషోర్‌రెడ్డి, గొర్రెల త్రిమూర్తులు, పల్లి రాజారెడ్డి, కొమ్మోజు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. అనపర్తి సీఐ సుమంత్ ఆధ్వర్యంలో పోలీసులు రథం చుట్టూ బందోబస్తు నిర్వహించారు.

బాణసంచా కాల్పులు, గ్రామోత్సవం

షష్ఠి ఉత్సవాల్లో భాగంగా శనివారం రాత్రి నిర్వహించిన శ్రీకుమార సుబ్రహ్మణ్యేశ్వరస్వామివారి గ్రామోత్సవం, బాణసంచా కాల్పులు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. గ్రామోత్సవంలో తీన్‌మార్, బ్యాండ్ కచేరీలు, నెమలి నాట్యాలు, నవదుర్గలు కనువిందు చేశారు. అలాగే బిక్కవోలు ఉన్నత పాఠశాలలో నిర్వహించిన బాణసంచా కాల్పివేత అందర్నీ మంత్ర ముగ్ధులను చేసింది. ఈతచెట్టు, మల్లెపందిరి, నిప్పులు వెదజల్లే షాట్‌లు, రంగురంగుల కాంతులిచ్చే బిగ్ షాట్‌లు, నిప్పురవ్వలు విడుస్తూ వెళ్లే రాకెట్‌లు కాల్చారు.



బాణసంచా కాంతులు

కాకినాడలో సినీ నటి శ్రీలీల సందడి

జేసీ షాపింగ్ మాల్ ప్రారంభం



కాకినాడలో జేసీ షాపింగ్ మాల్‌ను ప్రారంభిస్తున్న శ్రీలీల



షాపింగ్ మాల్‌లో సందడి చేస్తున్న శ్రీలీల

కార్పొరేషన్(కాకినాడ), డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): కాకినాడ నగరంలో ప్రముఖ సినీ నటి శ్రీలీల సందడి చేశారు. ఆదివారం ప్రముఖ జేసీ షాపింగ్ మాల్‌ను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నిత్యనూతన ఫ్యాషన్లకు నిలయమైన జేసీ మాల్‌ను కాకినాడలో ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు. మూడంతస్తుల్లో ఉన్న మాల్ సముదాయంలోని వస్త్రాలను ఆమె పరిశీలించారు. పట్టు, ఫ్యాన్సీ చీరలను చూపించారు. తెలుగు రాష్ట్రాల్లో చాలా షోరూంలు ఉన్నాయని, ఆంధ్రప్రదేశ్‌లో కాకినాడ షోరూం మూడోదిగా పేర్కొన్నారు. జేసీ మాల్‌లో అన్ని వర్గాలవారికి అందుబాటు ధరల్లో ఆధునిక శైలితో కూడిన వస్త్రాలను అమ్మకాలు చేస్తుంటారన్నారు. కాకినాడ పరిసర ప్రాంతాలవాసులు ఇక్కడి జేసీ మాల్‌కు వచ్చి కొనుగోలు చేయాలన్నారు. మహిళలు, యువతులు, చిన్నారులు, పురుషులకు ఇక్కడ అద్భుతమైన వస్త్రశేణి ఉందన్నారు. జేసీ మాల్ అధినేతలు ఎం.వెంకటరెడ్డి, జమున మాట్లాడుతూ కాంబో ఆఫర్లను ఇస్తున్నామన్నారు. తక్కువ ధరలో నాణ్యతతో కూడిన వస్త్రాలను అమ్మకాలు చేయడమే తమ విజయ సూత్రమన్నారు. అనంతరం శ్రీలీల మాల్ బయట ఏర్పాటు చేసిన వేదికపైకి రాగానే యువత కేరింతలు కొట్టారు. ఆమె లవ్ కాకినాడ అంటూ అందరినీ ఉత్సాహపరిచారు. డీఎస్పీ రఘువీర్ విష్ణు ఆధ్వర్యంలో ట్రాఫిక్‌కు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకున్నారు. కార్యక్రమంలో సిటీ ఎమ్మెల్యే వనమాడి వెంకటేశ్వరరావు, ఆదిత్య విద్యాసంస్థల వైస్ చైర్మన్ రాజ్యలక్ష్మి, సతీష్‌రెడ్డి పాల్గొన్నారు.

దత్త జయంతి సప్తాహ మహోత్సవాలు ప్రారంభం

తొలిరోజు సర్వపుష్ప పూజ



సర్వపుష్పపూజ అనంతరం శ్రీపాదశ్రీవల్లభులు, దత్తాత్రేయస్వామి, నృసింహ సరస్వతుల అలంకారం



పిఠాపురం పురవీధుల్లో దత్తాత్రేయస్వామి గ్రామోత్సవం

పిఠాపురం, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): దేశ వ్యాప్తంగా శ్రీపాదశ్రీవల్లభుల జన్మస్థానంగా ప్రాచుర్యం పొందిన కాకినాడ జిల్లా పిఠాపురంలోని శ్రీపాదశ్రీవల్లభ మహాసంస్థానంలో దత్త జయంతి సప్తాహ మహోత్సవాలు ఆదివారం ప్రారంభమయ్యాయి. తొలిరోజు మహాగణపతి పూజ, కలశస్థాపన, శ్రీపాదశ్రీవల్లభుల మహిమాన్విత దివ్య పాదపద్మములకు మహాన్యాసపూర్వక శతరుద్రాభిషేకం, శ్రీసూక్త, పురుషసూక్తములతో సహస్ర నామార్చన, మంగళహారతి, మంత్రపుష్పము, వేదపారాయణ, రుత్విక్కులచే మూల మంత్ర అనుష్ఠానం, గణపతి అధర్వ శీర్ష ఉపనిషత్ పారాయణ, గురుచరిత్ర, శ్రీపాదశ్రీవల్లభ చరితామృత పారాయణ జరిగాయి. సాయంత్రం అగ్నిప్రతిష్ఠాపన, దత్తమంత్ర హోమం, శ్రీపాదశ్రీవల్లభుల దివ్యపాదపద్మములకు వివిధ హారతులు, స్వామివారికి పల్లకిసేవ, సాయంకాలార్చన నిర్వహించారు. అంతకు ముందు ఉదయం దత్తాత్రేయస్వామి గ్రామోత్సవం వైభవంగా జరిగింది. పురవీధుల్లో ఉత్సవం సాగింది. సర్వపుష్ప అనంతరం శ్రీపాదశ్రీవల్లభులు, దత్తాత్రేయస్వామి, నృసింహ సరస్వతులను ప్రత్యేకంగా అలంకరించారు. ఉత్సవాల తొలిరోజు మహారాష్ట్ర, ఉభయ తెలుగురాష్ట్రాలు, కర్నాటక నుంచి భక్తులు అధికంగా తరలివచ్చారు. కార్యక్రమాల్లో ఆలయ కార్యనిర్వహణాధికారి సౌజన్య తదితరులన్నారు.

పాదగయలో నేటి నుంచి...

పిఠాపురంలోని పాదగయ క్షేత్రంలో స్వయంభువమూర్తిగా వెలసిన దత్తాత్రేయస్వామి దత్తజయంతి సప్తాహ మహోత్సవాలు సోమవారం నుంచి ప్రారంభంకానున్నాయి. వేదోక్త విధిననుసరించి దత్తాత్రేయ మంత్రానుష్ఠానము, హోమములు, గురుచరిత్ర పారాయణము, వేదపారాయణ, యతిపూజ, లక్ష బిల్వార్చన, సత్యదత్త వ్రతాదులతో సప్తాహదీక్షతో ఉత్సవాలు నిర్వహిస్తారు. డిసెంబరు 15 వరకూ జరిగే ఉత్సవాల్లో రోజూ మహాగణపతిపూజ, కలశస్థాపనలు, రుత్విక్‌వరణములు, పంచామృతాభిషేక సహిత రుద్రాభిషేకం, సహస్ర నామార్చన, మంగళహారతి, మంత్రపుష్పము, రుత్విక్కులతో దత్తమాల మంత్ర అనుష్ఠానం, గురుచరిత్ర పారాయణ, వేదపారాయణ, గణపతి అథర్వశీర్ష ఉపనిషత్ పారాయణ, విష్ణు, లలితా సహస్రనామ పారాయణలు, మధ్యాహ్నం 3గంటలకు అగ్నిప్రతిష్ఠాపన, దత్తమూల మంత్రహోమాదులు, సాయంత్రం సాయంకాల విశేష పుష్పార్చన జరుగుతాయి.

హైదరాబాద్ నుంచి పిఠాపురం దత్త పీఠానికి...

పాదయాత్రగా ఆలమూరు చేరుకున్న బృందం



పిఠాపురం దత్త పీఠానికి పాదయాత్ర చేస్తున్న బృందం సభ్యులు

ఆలమూరు, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పిఠాపురంలోని శ్రీదత్తపీఠానికి హైదరాదాద్‌లోని శ్రీవల్లభదత్త పీఠం నుంచి పాదయాత్ర చేస్తున్న బృందం ఆదివారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆలమూరుకు చేరుకుంది. లోకశాంతి కోసం ఈనెల 3న హైదరాబాద్‌లో శ్రీవల్లభదత్త పీఠం మాతాజీ శ్రీలత దత్త ఆధ్వర్యంలో బయలుదేరిన బృందం ఈనెల 11కు పిఠాపురం చేరుకోనున్నారు. ఆలమూరు నుంచి గుమ్మిలేరు చేరుకున్నవారికి పద్మావతి సేవా కేంద్రంలో సర్పంచ్ గుణ్ణం రాంబాబు బస ఏర్పాటు చేశారు. శ్రీవల్లభుని కర్మ, భక్తి సిద్ధాంతాన్ని అనుసరిస్తూ సనాతన ధర్మాన్ని పరిరక్షిస్తూ పాదయాత్ర చేస్తున్న బృందాన్ని గుమ్మిలేరు గ్రామస్తులు అభినందించారు.

దొంగతనాలకు పాల్పడిన వ్యక్తి అరెస్టు

125 గ్రాముల బంగారు వస్తువుల స్వాధీనం

రాజోలు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా సఖినేటిపల్లి మండలం అంతర్వేదిపాలెంలో రెండు చోట్ల ఇళ్లల్లో దొంగతనాలకు పాల్పడిన పశ్చిమ గోదావరి జిల్లా నర్సాపురం మండలం యర్రంశెట్టివారిపాలేనికి చెందిన కె.వెంకటేశ్వరరావును అరెస్టు చేసి రూ.8 లక్షల 50వేలు విలువ చేసే 125 గ్రాముల బంగారు వస్తువులు స్వాధీనం చేసుకున్నామని రాజోలు సీఐ టీవీ నరేష్‌కుమార్ తెలిపారు. రాజోలు పోలీసు సర్కిల్ కార్యాలయంలో ఆదివారం ఆయన వివరాలు తెలిపారు. సఖినేటిపల్లి మండలం అంతర్వేదిపాలెంలో బీరవారి కాల్వగట్టుకు చెందిన బీరా సువర్ణరాజు, చెల్లుబోయిన వెంకటేశ్వరరావులకు చెందిన ఇంట్లో ఏడాది క్రితం దొంగతనం జరిగిందన్నారు. నిందితుడు వెంకటేశ్వరరావును గుర్తించి దిండి చెక్‌పోస్టు వద్ద సఖినేటిపల్లి ఎస్‌ఐ కె.దుర్గాశ్రీనివాసరావు అరెస్టు చేసినట్టు తెలిపారు. కేసును చేధించిన సీఐ, ఎస్‌ఐ, సిబ్బందిని డీఎస్పీ గోవిందరావు, ఎస్పీ బి.కృష్ణారావు అభినందించారు.

ఇరువర్గాల కొట్లాటలో 20 మందిపై కేసులు

ఆత్రేయపురం, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలం పేరవరంలో సుబ్రహ్మణ్యేశ్వరస్వామి షష్ఠి వేడుకల్లో భాగంగా రెండు సామాజిక వర్గాలకు చెందిన వ్యక్తులు ఘర్షణకు దిగి దాడులకు పాల్పడడంతో 20 మందిపై కేసులు నమోదు అయ్యాయి. ఈ సంఘటనల నేపథ్యంలో పోలీస్ పికెట్ కొనసాగుతుంది. ఆదివారం ఇరువర్గాలకు చెందిన పెద్దలతో సీఐ విద్యాసాగర్ శాంతి సమావేశం నిర్వహించారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే ఉపేక్షించేదిలేదన్నారు. 2 సామాజిక వర్గాలు శాంతియుతంగా నడుచుకోవాలన్నారు. శనివారం రాత్రి పేరవరంలో షష్ఠి తీర్థమహోత్సవంలో తమపై దాడులకు పాల్పడిన్నట్టు ఒక వర్గానికి చెందిన వెంకటేశ్వరరావు, మరోవర్గానికి చెందిన తాళ్ళ గణేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు 20మందిపై కేసులు నమోదు చేసినట్టు ఎస్‌ఐ రాము తెలిపారు.

ప్రజా హక్కుల పోరాటంలో 'ఐలాజ్' ముఖ్యపాత్ర

అన్నవరంలో మొదటి రాష్ట్ర మహాసభ



ప్రసంగిస్తున్న జాతీయ ప్రధాన కార్యదర్శి రత్నకుమార్

అన్నవరం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): దేశ వ్యాప్తంగా న్యాయవాదుల ప్రయోజనాలు కాపాడటంతో పాటుగా ప్రజల హక్కుల పోరాటంలో ఆల్‌ఇండియా లాయర్స్ అసోసియేషన్ ఫర్ జస్టిస్ (ఐలాజ్) ముఖ్య పాత్ర పోషిస్తుందని రాష్ట్ర నాయకులు బుగత శివ పేర్కొన్నారు. ఆదివారం కాకినాడలో అన్నవరంలోని ఓ ప్రైవేట్ లాడ్జిలో మొదటి రాష్ట్ర మహాసభ నిర్వహించారు. ముఖ్య అతిథిగా జాతీయ ప్రధాన కార్యదర్శి క్లిఫ్టన్ డి రోజారియా విచ్చేశారు. ఐలాజ్ రెండేళ్లుగా న్యాయవాదులపై, మహిళలపై జరుగుతున్న దాడులను ఖండించి వాటిని అరికట్టేందుకు ఉద్యమించడం జరిగిందన్నారు. 60 ఏళ్ల దాటిన న్యాయవాదులను పెన్షన్ల సౌకర్యం కల్పించడం, మానవ అక్రమ రవాణా, బాల్యవివాహాలపై పోరాటం చేస్తుందన్నారు. ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దులో ఐలాజ్ ముఖ్య భూమిక పోషించిందన్నారు. కార్యక్రమంలో జాతీయ ప్రధాన కార్యదర్శి జేసు రత్నకుమార్, ఐలాజ్ నాయకులు, న్యాయవాదులు పాల్గొన్నారు. అనంతరం 15 మందితో నూతన రాష్ట్రకమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నా రు. రాష్ట్ర అధ్యక్షుడిగా రాం ప్రసాద్, ఉపాధ్యక్షులుగా రాఘవేంద్ర రావు, కార్యదర్శిగా బుగతా శివ కోశాధికారిగా అవసరాల శ్రీదేవి ఎన్నికయ్యారు.



కార్యక్రమానికి హాజరైన న్యాయవాదులు

ఆటోను ఢీకొన్న ఆర్టీసీ బస్సు

ఒకరి మృతి మరొకరికి తీవ్రగాయాలు





ప్రమాదంలో ఆటో, మృతిచెందిన సూర్యచంద్రం

కొవ్వూరు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సు ఉల్లిపాయల లోడు ఆటోను ఢీకొని ఒకరు మృతిచెందగా.. మరొకరు తీవ్రగాయాల పాలయ్యారు. పశ్చిమగోదావరి జిల్లా తణుకు మండలం దువ్వ గ్రామానికి చెందిన ఆటోడ్రైవర్ కె.సూర్యచంద్రం (35), శ్రీరాముల దుర్గారావు ఊరూరా తిరుగుతూ ఆటోలో ఉల్లిపాయలు వ్యాపారం చేస్తుంటారు. కొవ్వూరు మండలం పంగిడి గ్రామంలో ఆదివారం ఉల్లిపాయలు విక్రయించుకుని కాపవరం వైపు వస్తుండగా కాపవరం జంక్షన్‌లోని రాళ్ళమడుగు వంతెనపై నర్సీపట్నం డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు ముందువెళుతున్న లారీని తప్పించబోయి ఎదురుగా వస్తున్న ఆటోను ఢీ కొంది. ఈ ప్రమాదంలో ఆటోలో ఉన్న డ్రైవర్, ఉల్లిపాయలు విక్రయిస్తున్న ఇద్దరు కిందపడిపోయారు. క్షతగాత్రులను 108 అంబులెన్స్‌లో కొవ్వూరు ప్రభుత్వాసుపత్రికి.. అక్కడ నుంచి మెరుగైన వైద్యం నిమిత్తం రాజమహేంద్రవరం తరలించారు. ఆటోడ్రైవర్ కె.సూర్యచంద్రం (35) ఆసుపత్రిలో మృతిచెందాడు. మెరుగైన వైద్యం నిమిత్తం శ్రీరాముల దుర్గారావును జీఎస్ఎల్‌కు తరలించారు. కొవ్వూరు రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు.

మహిళ హత్య

వివాహేతర సంబంధమే కారణం?



మీనాకుమారి మృతదేహం

కాకినాడ క్రైం, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): వివాహేతర సంబంధం నేపథ్యంలో ఓ మహిళ హత్యకు గురైన సంఘటన ఆదివారం కాకినాడలో జరిగింది. కాకినాడ పర్లోవపేట ఏఎంజీ స్కూల్ వెనుక వీధికి చెందిన ఆకుల మీనాకుమారి (35) కుమారుడు, కుమార్తెతో కలిసి నివసిస్తోంది. కాగా పదేళ్ల క్రితం విభేదాలు వచ్చి భార్యభర్తలు విడిపోయి వేర్వేరుగా ఉంటున్నారు. మీనాకుమారి తాపీ పనిలో కూలీగా వెళ్తూ తన బిడ్డలను పోషించుకుంటోంది. ఈ క్రమంలో స్థానిక రామకృష్ణారావుపేటకు చెందిన 42ఏళ్ల సబ్బి రాంబాబురెడ్డితో ఐదేళ్లక్రితం ఆమెకు పరిచయం ఏర్పడి వివాహేతర సంబంధంగా మారింది. అతడు కూడా తన భార్యతో విభేదించి రామకృష్ణారావుపేటలో తన తల్లితో ఉంటున్నాడు. ఈ క్రమంలో ఇద్దరూ ఒకరింటికి ఇంకొకరు రాకపోకలు సాగిస్తున్నారు. నెల రోజుల నుంచి మీనాకుమారి వద్దకు వేరే వ్యక్తి రావడాన్ని రాంబాబు రెడ్డి గమనించాడు. ఈ క్రమంలో ఆమె 3రోజుల క్రితం తన సెల్‌ఫోన్‌ను స్విచ్‌ఆఫ్ చేసింది. దీంతో రాంబాబురెడ్డి ఆమెకు ఫోన్ చేసి.. చేసి.. సహనం కోల్పోయాడు. ఎట్టకేలకు ఆమె ఆదివారం సెల్‌ఫోన్‌ను స్విచ్‌ఆన్ చేసింది. ఈ నేపథ్యంలో ఇద్దరి మధ్య ఫోన్‌లో గొడవ జరిగింది. అనంతరం మీనాకుమారి నేరుగా రామకృష్ణారావుపేట రాంబాబురెడ్డి ఇంటికి వెళ్లింది. అక్కడ ఇద్దరి మధ్య తారాస్థాయిలో ఘర్షణ జరిగింది. ఈ క్రమంలో అతడు క్షణికావేశంలో ఇనుపరాడ్‌తో ఆమె తలపై మోదాడు. దీంతో తీవ్ర రక్తస్రావంతో పడిఉన్న ఆమెను స్థానికులు జీజీహెచ్‌కు తరలిస్తుండగా మార్గ మధ్యలో మృతి చెందింది. కాకినాడ టూటౌన్ సీఐ మజ్జి అప్పలనాయుడు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నిద్రమత్తులో ట్రక్కు నుంచి జారిపడి వ్యక్తి మృతి

ఊబలంక వాసిగా గుర్తింపు



అప్పారావు (ఫైల్)

కొవ్వూరు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన వ్యక్తి ఊబలంక గ్రామానికి చెందిన మల్లిడి అప్పారావు (63)గా గుర్తించినట్టు కొవ్వూరు పట్టణ హెడ్ కానిస్టేబుల్ ఎంవివి.సత్యనారాయణ తెలిపారు. పోలీసులు అందించిన వివరాల ప్రకారం.. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రావులపాలెం మండలం ఊబలంక గ్రామానికి చెందిన మల్లిడి అప్పారావు మరికొంతమందితో కలిసి చేపలవేటకు ఈనెల 6వ తేదీన ఇంటి నుంచి బయలుదేరి తెలంగాణ రాష్ట్రం భద్రాచలం జిల్లా మణుగూరు వెళ్లారు. అక్కడ చెరువులో చేపలు పట్టి పని పూర్తికావడంతో మధ్యాహ్నం బడాదోస్తు ట్రక్కు వాహనంలో వలలు ఎక్కించుకుని నలుగురు వ్యక్తులు ఇంటికి బయలుదేరారు. ట్రక్కులో వలలపై పడుకున్న అప్పారావు కొవ్వూరు ఏషియన్ పేయింట్స్ గొడౌన్ సమీపానికి వచ్చేసరికి శనివారం రాత్రి వాహనం నుంచి కిందపడిపోయాడు. అప్పారావు పైనుంచి అనేక వాహనాలు వెళ్లిపోవడంతో మృతదేహం ముక్కలు అయిపోయి చెల్లాచెదురుగా పడింది. సమాచారం తెలుసుకున్న పట్టణ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ముక్కలు అయిపోయిన మృతదేహాన్ని కొవ్వూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఇది గమనించకుండా మిగిలినవారు ట్రక్కులో ఊబలంక వెళ్లిపోయారు. అక్కడ చూసుకుని అప్పారావు లేకపోవడంతో మళ్లీ అదే వాహణంలో వెనక్కి వెతుక్కుంటూ వచ్చారు. కొవ్వూరు ఏషియన్ పేయింట్స్ గొడౌన్‌వద్ద ప్రమాదంలో వ్యక్తి మృతిచెందాడని తెలిసి కొవ్వూరు ప్రభుత్వాసుపత్రికి వచ్చారు. మృతదేహం వద్ద ఉన్న దుస్తుల ఆధారంగా మల్లిడి అప్పారావు (63)గా గుర్తించారు. మృతుడి అల్లుడు పెసంగి మోసేరాజు అందించిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు హెడ్‌కానిస్టేబుల్ ఎంవివి. సత్యనారాయణ తెలిపారు.

తాండవ నదిలో యువకుడి గల్లంతు

తుని రూరల్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా తుని మండలం రేఖవానిపాలెనికి చెందిన గెడ్డం సాయి(23) శనివారం ఉదయం కాలు జారి తాండవ నదిలో గల్లంతయ్యాడు. స్థానికులు సమాచారంతో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతదేహం వెలికితీత చర్యలు ముమ్మరం కాకపోవడంతో సాయి తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగావిలపిస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో తల్లీకూతురు మృతి

ట్రాక్టర్ కింద పడి తీవ్రగాయాలు

మార్గమధ్యలో కూతురు... ఆసుపత్రిలో తల్లి దుర్మరణం


గోపాలపురం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో తల్లీకూతురు మృతిచెందారు. ఏలూరు జిల్లా పోలవరం మండలం బండార్లగూడెం గ్రామానికి చెందిన అంగన్‌వాడీటీచర్ కురసాని కాంతమ్మ (45) ఆదివారం తల్లి కవలం గన్నమ్మ (75)ను తీసుకుని స్కూటీపై దొండపూడి నుంచి కుంకాల వైపు వెళుతున్నారు. దొండపూడి వద్ద తల్లీకుమార్తె ప్రయాణిస్తున్న స్కూటీ ముందు వెళ్తున్న ట్రాక్టర్‌ను తప్పించే క్రమంలో ఎదురుగా వస్తున్న ట్రాక్టర్ కిందపడి తీవ్రగాయాలపాలయ్యారు. స్థానికులు గమనించి వెంటనే 108 వాహనంలో ఎల్లండీపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స అనంతరం 108 వాహనంలో రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో కాంతమ్మ మృతి చెందింది. అనంతరం తల్లి కవలం గన్నమ్మను ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా ఆమె మృతి చెందింది. దీనిపై పోలీసులకు సమాచారం ఇచ్చినట్టు స్థానికులు తెలిపారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. మృతదేహాలకు రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు. తల్లీకూతురు మృతిచెందడంతో బండార్లగూడెం గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

ఊర చెరువులో పడి వ్యక్తి మృతి

అనుమానాస్పద మృతిగా కేసు నమోదు

అనపర్తి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): అనపర్తి మండలం కుతుకులూరు ఊర చెరువులో పడి అనపర్తికి చెందిన దొడ్డు మధుకుమార్ (54) మృతిచెందాడు. అనపర్తి ఎస్‌ఐ శ్రీనునాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. అనపర్తికి చెందిన దొడ్డు మధుకుమార్ గత కొన్నేళ్లుగా అనపర్తిలోని నివాసం ఉంటూ ప్రైవేటుగా డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. శనివారం రాత్రి కుతుకులూరులోని ఊర చెరువు సమీపంలో తన మిత్రులతో కలిసి మద్యం తాగాడు. మద్యం మత్తులో ఉన్న మధుకుమార్ సమీపంలోని ఊర చెరువులో పడి మృతిచెందాడు. ఆదివారం ఉదయం చెరువులో మృతదేహం కనిపించడంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో వారు మధుకుమార్ బంధువులకు సమాచారం అందించారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. మండపేటకు చెందిన మధుకుమార్ కొంతకాలం కుతుకులూరులో నివాసం ఉండగా ప్రస్తుతం అనపర్తిలోని నివాసం ఉంటున్నాడు. శనివారం రాత్రి ఏమి జరిగిందన్న అంశంపై విచారణ నిర్వహిస్తున్నామని, బంధువుల ఫిర్యాదు మేరకు కేసు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారరు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించినట్టు అనపర్తి ఎస్‌ఐ శ్రీనునాయక్ తెలిపారు.

రైల్వే ట్రాక్‌పై గుర్తుతెలియని మృతదేహం



సామర్లకోట, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా సామర్లకోట రైల్వే స్టేషన్ పరిధిలో మూడవ నంబరు ట్రాక్ వద్ద సుమారు 30 ఏళ్ల వ్యక్తి మృతదేహాన్ని సామర్లకోట రైల్వే పోలీసులు ఆదివారం గుర్తించారు. గూడ్స్ రైలు లోకోపైలట్ అందించిన సమాచారంతో సామర్లకోట రైల్వే పోలీసులు సంఘటనా స్థలికి చేరుకుని దర్యాప్తు ప్రారంభించారు. మృతదేహం ఎడమచేతిపై పి.నాగేశ్వరరావు, లోవ అనే పేర్లు.. కుడిచేతి దండపై సూర్యుడి గుర్తు, ఎడమ చేతిపై పాము ఆకారములో పచ్చబొట్టులు ఉన్నట్టు పోలీసులు గుర్తించారు. సామర్లకోట రైల్వే పోలీస్‌స్టేషన్ ఇంచార్జి పి.వాసు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్టు రైల్వే పోలీసులు తెలిపారు.

ఉపాధ్యాయులను నియమించాలి
రావులపాలెం,డిసెంబరు8(ఆంధ్రజ్యోతి): హిందీ ఉపాధ్యాయులను నియమించాలని రాష్ట్ర భాషోపాధ్యాయ అధ్యక్షుడు బి.సాయిబాబా అన్నారు. రావులపాలెం జడ్పీ పాఠశాలలో ఆదివారం ఉమ్మడితూర్పుగోదావరి జిల్లా భాషోపాధ్యాయ సంఘ సమావేశం రాష్ట్ర అధ్యక్షుడు సాయిబాబా అధ్యక్షతన జరిపారు. కోనసీమ జిల్లా కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు.

ఘనంగా శ్రీనివాసుడి కల్యాణం
మండపేట, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి) పట్టణంలోని బూరుగుంట సీతారామ క్షేత్రంలో శనివారం రాత్రి శ్రీనివాసుడి కల్యాణాన్ని భక్తి శ్రద్ధలతో జరిపారు. అర్చకుడు ఎం.సీతారామాచార్యులు, ఆలయ అర్చకులతో పట్టణానికి చెందిన వాసవి సప్లయి కంపెనీ నిర్వాహకుడు రాంబాబు కుటుంబ సభ్యులతో కల్యాణ కార్యక్రమాలు జరిపారు.

నిధులు లేక నిలిచిన భవన నిర్మాణాలు

- అడ్వాన్స్‌లు తీసుకుని చేతులెత్తేసిన కాంట్రాక్టర్లు
- 14హెల్త్ సెంటర్ భవనాల్లో రెండు మాత్రమే పూర్తి



పిచ్చిమొక్కలతో పాత ఇంజరం ఆర్బీకే కేంద్రం,పునాది దశ దాటని ఐ.పోలవరం సచివాలయ భవనం

ఐ.పోలవరం, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వంలో వైసీపీ నాయకులు కాంట్రాక్టర్ల అవతారమెత్తి ప్రభుత్వ భవనాల నిర్మాణాలను పూర్తి చేయకుండా గాలికొదిలేశారు. నిధుల విడుదల కాక నిలిచిన భవనాలు కొన్నైతే, అడ్వాన్సు తీసుకున్న కాంట్రాక్టర్లు పనులు చేయకుండా వదిలేసిన భవనాలు మరికొన్ని ఉన్నాయి. సచివాలయ భవనాల నిర్మాణాలకు నిధులు గత ప్రభుత్వం నిధులు కేటాయించింది. రైతు భరోసాకేంద్రాల నిర్మాణాలకు కూడా నిధులు కేటాయించింది. హెల్త్ సెంటర్ భవనాల నిర్మాణాలను సైతం చేపట్టింది. అయితే ఆయా భవనాల నిర్మాణం కొన్ని గ్రామాల్లో పూర్తికాగా, మరికొన్ని గ్రామాల్లో భవనాలు పునాది దశలోనే ఉన్నాయి. మండలంలో 20భవనాలకు ఐదు మాత్రమే పూర్తయ్యాయి. టి.కొత్తపల్లిలో రెండు, కొమరగిరి, గుత్తెనదీవి, జి.వేమవరం గ్రామాల్లో మాత్రమే సచివాలయ భవనాలు పూర్తయ్యాయి. మిగిలిన 15భవనాలు వివిధ దశల్లో ఉన్నాయి. వీటిలో చాలా వరకు పునాది దశలోనే ఉన్నాయి. రైతు భరోసాకేంద్రాలకు సంబంధించి పరిస్థితి మరీ దారుణంగా ఉంది.

12భవనాలకు గాను ఒక్క గోగుల్లంకలో మాత్రమే భవన నిర్మాణం పూర్తయింది. మిగిలిన 11అసంపూర్తిగానే ఉన్నాయి. 14హెల్త్ సెంటర్ భవనాల్లో రెండు మాత్రమే పూర్తయ్యాయి. పాతయింజరం రైతు భరోసాకేంద్రం పనులు పునాది దశ దాటలేదు. ఆ భవన పునాదుల్లో పిచ్చిమొక్కలు మొలిచి భవనం శిథిల స్థితికి చేరింది. ఐ.పోలవరం సచివాలయం భవనం భూమిలో ఐరన్ సెంటరింగ్ నిర్మించి గాలికి వదిలేశారు. అయితే చేసిన పనులకు బిల్లులు రాలేదని కొందరు కాంట్రాక్టర్లు అంటున్నారు. ఇంజనీరింగు అధికారులు కాంట్రాక్టర్లకు సహకరించడంతో పనులు మధ్యలోనే నిలిచిపోయినట్టు ఆరోపణలున్నాయి. ప్రభుత్వం మారినా భవనాల పరిస్థితిలో మార్పులేదు. భవనాల నిర్మాణానికి ప్రభుత్వం నిధులు ఇస్తే పనులు ప్రారంభించేందుకు గ్రామాల వారీగా అధికార పార్టీ నాయకులు పావులు కదుపుతున్నారు. భవనాల నిర్మాణం త్వరితగతిన పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

మాలల మహాగర్జన సభకు తరలిరావాలి


మాట్లాడుతున్న అఖిలభారత మాల సంఘాల జేఏసీ చైర్మన్ పందు అశోక్‌బాబు

ముమ్మిడివరం, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా గుంటూరులో ఈనెల15న నిర్వహించే మాలల మహాగర్జన సభకు పార్టీలకు అతీతంగా మాలలంతా అధిక సంఖ్యలో తరలిరావాలని అఖిల భారత మాల సంఘాల జేఏసీ చైర్మన్ పందు అశోక్‌బాబు పిలుపునిచ్చారు. ముమ్మిడివరంలోని అంబేడ్కర్ కమ్యూనిటీ భవనంలో ఆదివారం జరిగిన ముమ్మిడివరం నియోజకవర్గ మాలల సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా అఖిల భారత మాల సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో నిర్వహించే మాలల మహాగర్జన సభకు అధిక సంఖ్యలో మాలలు పాల్గొని మాలలపై కొన్ని పార్టీలు చేస్తున్న కుటిల రాజకీయాలను తిప్పికొట్టడానికి గ్రామీణ ప్రాంతాల నుంచి మాలలు అధిక సంఖ్యలో తరలిరావాలన్నారు. సుప్రీం కోర్టు ఇచ్చిన వర్గీకరణను వెనకకు తీసుకునే విధంగా జన బలంతో సత్తా చాటాలన్నారు. ఎస్సీ, ఎస్టీ వర్గీకరణకు క్రీమీ లేయర్‌కు సుప్రీంకోర్టు అనుకూల సూచన ఇచ్చిన నేపథ్యంలో ఆంధ్ర రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ చేయుటకు అనుకూలంగా వ్యవహరిస్తుందన్నారు. అయితే జాతీయ స్థాయిలో మాయావతి, పాశ్వాన్, అజాద్‌రావన్, రాందాస్‌అథాలే వంటి మాదిగ నేతలే ఎస్సీ వర్గీకరణ చేయవద్దంటూ మనువాద పార్టీలకు వ్యతిరేకంగా పోరాడుతూ గళాన్ని విప్పుతుంటే తెలుగు రాష్ట్రాల్లో మాత్రం మందకృష్ణమాదిగ మానువాద భావజాలం కలిగిన పార్టీలకు మద్దతు ఇవ్వడం శోచనీయమన్నారు. రాష్ట్రంలో అతిపెద్ద సామాజికవర్గం మాలల సామాజిక వర్గమేనని, రాజకీయ పార్టీలు మాలలను కేవలం ఓటు బ్యాంకు రాజకీయాలకు వాడుకుంటూ నిత్యం మాలలను అణగదొక్కుతున్నారన్నారు. మాలలంతా ఐకమత్యంతో ఒకతాటి పైకి వచ్చి ఎస్సీ వర్గీకరణపై రాష్ట్ర ప్రభుత్వం నియమించిన ఏకసభ్య కమిషన్‌ను రద్దుచేసి ఎస్సీ వర్గీకరణను విరమించుకోవాలనే డిమాండ్‌తో భవిష్యత్తు భావితరాలకు మాలల మహాగర్జన సభను నిర్వహిస్తున్నామన్నారు. సమావేశంలో నగర పంచాయతీ చైర్మన్ కమిడి ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ నియోజకవర్గ మాలలంతా అధిక సంఖ్యలో పాల్గొని మాలల సత్తాను చాటాలన్నారు. జనిపల్లి సత్యనారాయణ, దేవరపల్లి ఏడుకొండలు, కాశి జగపతిరావు, ఎం.ఆశీర్వాదం, మెండి కృష్ణబాబు, తిరుకోటి శాంతిసుధ, దాసరి వెంకటరమణలతో పాటు పలువురు ఉద్యోగులు, మాలమహానాడు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కూటమి పాలనలో యాదవులకు అధిక ప్రాధాన్యం


ఓడలరేవులో యాదవ సదస్సులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆనందరావు

అల్లవరం, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు నేతృత్వంలో కూటమి పాలనలో యాదవ సామాజిక వర్గానికి అధిక ప్రాదాన్యం కల్పిస్తున్నారని ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు అన్నారు. వారి చిరకాలవాంఛ అయిన యాదవుల కమ్యూనిటీ భవనాన్ని నిర్మిస్తామని చెప్పారు. ఓడలరేవులో నియోజకవర్గ అధ్యక్షుడు కైల సాయిశోభన్‌బాబు అధ్యక్షతన యాదవ ఆత్మీయ కలయిక నియోజకవర్గ సమావేశం ఆదివారం జరిగింది. యాదవుల సంక్షేమానికి కృషిచేస్తానని ఎమ్మెల్యే అన్నారు. నియోజకవర్గ పరిధిలో పదో తరగతిలో ప్రతిభావంతులైన యాదవుల విద్యార్థులకు ప్రోత్సాహకాలు అందజేశారు. అనంతరం యాదవ సామాజిక వర్గీయులు ఎమ్మెల్యే ఆనందరావును సత్కరించారు. ప్రధాన కార్యదర్శి సోమాని వెంకటరమణ, కోరశిక సుబ్రహ్మణ్యం, మండపాటి రామకృష్ణ, మన్నే వెంకటేశ్వరరావు, చిట్టిమేను దుర్గబాబు పాల్గొన్నారు.

చెరువులు కావవి.. ఓడలరేవు ఓఎన్జీసీ రోడ్లు


ఓడలరేవులో చెరువును తలపిస్తున్న ఓఎన్జీసీ రోడ్డు

అల్లవరం, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): కృష్ణా, గోదావరి బేసిన్ పరిధిలో చమురు సహజ వాయువు ఉత్పత్తుల్లో అగ్రగామిగా నిలిచిన ఓడలరేవులో ఓఎన్జీసీ రోడ్లు అభివృద్ధికి నోచుకోక అధ్వానంగా తయారయ్యాయి. ఓడలరేవు ఓఎన్జీసీ అన్‌షోర్ టెర్మినల్‌కు భారీ వాహనాలు, ఇతర వాహనాలు నిత్యం తిరిగే ఈరోడ్లు భారీ గోతులు పడి చెరువులను తలపిస్తున్నాయి. ప్రమాదభరితంగా ఉన్న ఈరోడ్లను ఓఎన్జీసీ కనీసం సీఎస్ఆర్ నిధులతో అభివృద్ధి చేయలేకపోయిందని ప్రజలు ఆరోపిస్తున్నారు. గడిచిన 30ఏళ్లగా చమురు ఉత్పత్తులతో రూ.లక్షల కోట్లు ఆర్జించిన ఓఎన్జీసీ యుద్ధ ప్రాతిపదికన రోడ్ల మరమ్మతులు, అభివృద్ధి చేయకుంటే ఆందోళన చేస్తామని గ్రామస్థులు హెచ్చరిస్తున్నారు.

నిత్యాన్నదానానికి 26 బియ్యం బస్తాలు విరాళం


దాతకు స్వామివారి చిత్ర పటం అందిస్తున్న దృశ్యం

అంతర్వేది, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఆదివారం స్వామివారి దర్శనం అనంతరం నిత్యాన్నదాన ట్రస్టుకు భీమవరానికి చెందిన ఆకుల అభిజిత్ రూ.40వేలు విలువైన 26బియ్యం బస్తాలను విరాళంగా అందించారు. దాతకు ఆలయ సహాయ కమిషనర్ వి.సత్యనారాయణ స్వామివారి చిత్రపటం, ప్రసాదం అందించారు. కార్యక్రమంలో కిరణ్, అన్నదానం స్వామి తదితరులు పాల్గొన్నారు.

హృదయ శుద్ధి గలవారు ధన్యులు



మాట్లాడుతున్న బ్రదర్ సాయిబాబు

అమలాపురం టౌన్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): హృదయ శుద్ధి గలవారు ధన్యులని, అటువంటి వారు మాత్రమే యెహోవాను చూడగలరని భీమవరానికి చెందిన బ్రదర్ సాయిబాబు పేర్కొన్నారు. అమలాపురం గడియార స్తంభం సెంటర్‌లో ఆదివారం రాత్రి టౌన్ క్రిస్మస్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. పాస్టర్ ఇజ్రాయిల్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పలువురు వక్తలు మాట్లాడుతూ ఏసుక్రీస్తు జననం గురించి వివరించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఉప్పలగుప్తం తహశీల్దార్ వాసా శామ్యూల్‌దివాకర్ క్రిస్మస్ కేక్‌ను కట్‌చేశారు. క్రిస్మస్ ప్రార్థనా గీతాలు ఆహుతులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. యూత్ అసోసియేషన్ అధ్యక్షుడు నక్కా రాజ్‌కిశోర్, కార్యదర్శి గొల్ల ప్రసన్నకుమార్, పాస్టర్ రవి పాల్, ఎలీషా, పృథ్వీతదితరులు పాల్గొన్నారు.

బాధితురాలికి సాయం అందజేత
ముమ్మిడివరం, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): స్థానిక 20వ వార్డుకు చెందిన కొప్పిశెట్టి భూలక్ష్మి ఇల్లు ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదంలో దగ్ధమైంది. హైదరాబాద్‌కు చెందిన జీఎంకే ట్రస్టు అధ్యక్షురాలు గుత్తుల మీరాకుమారి, కార్యదర్శి పిల్లి నాగగోపాలకృష్ణ దాతల ద్వారా సమకూర్చిన రూ.50వేలు విలువైన గృహోపకర సామగ్రిని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గుత్తుల సాయి ఆదివారం బాధితురాలికి అందించారు. దొమ్మేటి రమణకుమార్, పిల్లి నాగరాజు, సానబోయిన మల్లికార్జునరావు, దొమ్మేటి అప్పారావు, దాసు, శ్రీను, చెల్లుబోయిన శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కాల్వలో పూడికతీతతో పైప్‌లైన్లు ధ్వంసం

తరచూ తాగునీటికి ఇక్కట్లు


ఎక్స్‌కవేటర్ వల్ల పైప్ లైన్ ధ్వంసం కావడంతో వాడపర్రు పంటకాల్వలోకి తాగునీరు ప్రవహిస్తున్న దృశ్యం

ఉప్పలగుప్తం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): కాల్వల్లో పూడికతీత పనులు చేస్తున్నారంటే జనం భయపడుతున్నారు. కూలీలతో చేయించాల్సిన పనులకు యంత్రాలను వినియోగించడంతో కాల్వగట్లపై ఉన్న ఆర్‌డబ్ల్యూఎస్ పైప్‌లు దెబ్బతింటున్నాయి. పైప్‌లు ధ్వంసమై తాగునీరు కాల్వల్లోకి పోతోంది. పైప్‌లు బాగు చేయాలంటే కొన్ని రోజుల వ్యవధి పడుతోంది. ఒక చోట జరిగిన లోపాలను సవరించి తాగునీటి సరఫరా పునరుద్ధరించే సమయానికి మరోచోట కాల్వ పనులు ప్రారంభమవుతున్నాయి. అక్కడా ఇదే పరిస్థితి. ఇలా తరచూ జనానికి తాగునీటి ఇక్కట్లు తప్పడంలేదు. లక్ష్మీవాడ- వాడపర్రు పంటకాల్వ పరిధిలో పూడికతీత పనుల్లో నిర్లక్ష్యం వల్ల ఈఇబ్బందులు తలెత్తుతున్నట్టు ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వాటర్ పైప్‌లైన్ ఉన్నంత మేరకు పూడికతీతలకు యంత్రాలను ఉపయోగించకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను కోరుతున్నారు.

ఏజెంట్లకు మేలు కలిగించే చర్యలు తీసుకోవాలి

10న ఏజెంట్ల ధర్నాను విజయవంతం చేయాలి


నిరసన తెలుపుతున్న ఎల్ఐసీ ఏజెంట్లు

అమలాపురం టౌన్, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): ఎల్ఐసీ ఏజెంట్లతో పాటు పాలసీదారులకు మేలు కలిగించే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఎల్ఐసీ ఏవోఐ ఏజెంట్స్ ఆర్గనైజేషన్ ఆఫ్ ఇండియా పిలుపు మేరకు ఈనెల10న రాజమహేంద్రవరం ఎల్ఐసీ డివిజినల్ కార్యాలయం ఎదుట చేపట్టిన ధర్నాను విజయవంతం చేయాలని కార్యదర్శి జి.వినాయకరావు పిలుపునిచ్చారు. అమలాపురం బ్రాంచి కార్యాలయం వద్ద ఆదివారం డివిజన్ సంఘ అధ్యక్షుడు సానబోయిన వీరభద్రరావు ఆధ్వర్యంలో పోస్టర్లు ఆవిష్కరించి నిరసన తెలిపారు. పాలసీలపై బోనస్ రేటు పెంచాలని, జీఎస్టీ ఎత్తి వేయాలని, గరిష్ఠ వయసు 55ఏళ్లకు పెంచాలని, క్లా బ్యాక్ ఆఫ్ కమిషన్ నిబంధనను వెంటనే నిలుపుదల చేయాలని నినాదాలు చేశారు. కోశాధికారి దొమ్మేటి శివస్వామి, ఎం.దుర్గాశ్రీనివాస్‌గౌడ్, పిడక దుర్గాదేవి, శీలం లంకేశ్వరుడు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి యోగా పోటీలకు అంధ విద్యార్థుల ఎంపిక


యోగా పోటీలకు ఎంపికైన అంధ విద్యార్థులు

అమలాపురంటౌన్,డిసెంబరు8(ఆంధ్రజ్యోతి): అమలాపురం శ్రీస్వామి వివేకానంద యోగాశ్రమంలో శిక్షణ పొందుతున్న స్థానిక లూయీ అంధుల పాఠశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయి యోగా పోటీలకు ఎంపికైనట్టు జిమ్‌కోచ్ ఆకుల శ్రీనివాస్ తెలిపారు. అంధ విద్యార్థులు రెండేళ్లుగా ఉచితయోగాశిక్షణ పొందుతున్నారన్నారు. కె.ధనబాబు, ఎ.పవన్‌కుమార్, టి.సందీప్‌కుమార్, కె.శివనాగబాబు, కె.సత్తిబాబు,జి.వంశీ దివ్యాంగుల కోటాలో రాష్ట్రస్థాయి యోగా పోటీలకు ఎంపికయ్యారన్నారు.ఈనెల10న విశాఖపట్నంలోజరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు.

విశ్వకర్మయోజన శిక్షణా తరగతులు ప్రారంభించాలి


జిల్లా స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి శేషుకు వినతిపత్రం ఇస్తున్న చేతివృత్తుల సంఘ నాయకులు

అమలాపురం టౌన్, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): విశ్వకర్మ యోజన గుర్తింపు కార్డులు పొందిన చేతివృత్తుల వారికి జిల్లాలో వెంటనే శిక్షణా తరగతులు ప్రారంభించి ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరుతూ జిల్లా స్కిల్ డెవలెప్‌మెంట్ అధికారి డి.హరీష్‌శేషుకు దుర్గామల్లేశ్వరస్వామి కార్పెంటర్ చేతివృత్తుల సంక్షేమ సేవా సంఘం జిల్లాశాఖ అధ్యక్షుడు దేవాదుల సూర్యనారాయణమూర్తి ఆధ్వర్యంలో సంఘ నాయకులు వినతిపత్రం అందించారు. విశ్వకర్మయోజన పథకం కింద 18రకాల చేతివృత్తిదారులను ఆన్‌లైన్ చేయగా వారికి రిజిస్ట్రేషన్ పత్రాలతో పాటు గుర్తింపుకార్డులు సైతం అందాయన్నారు. అయినా ఇంతవరకు శిక్షణా తరగతులు ప్రారంభించలేదన్నారు. కార్యక్రమంలో సంఘ ప్రధాన కార్యదర్శి గున్నేపల్లి భీమశంకరం, కొనుకు వెంకటేశ్వరరావు, పితాని బేబిరావు, కముజు వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


చికిత్స పొందుతూ వ్యక్తి మృతి
ఆత్రేయపురం, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): ఇటీవల పురుగుల మందు తాగిన ఘటనలో ఒకవ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్ఐ ఎస్.రాము తెలిపారు. ఆత్రేయపురం గ్రామానికి చెందిన వారా తాతారావు(44) ఈనెల 4న పురుగుల మందు తాగాడు. అనారోగ్యంతో పాటు కుటుంబ సమస్యలపై మనస్థాపానికి గురై 4న పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఆసుపత్రి సమాచారం మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

టిడ్కో గృహాల బ్యాంకు రుణాలు మాఫీ చేయాలి


బోడసకుర్రు టిడ్కో గృహాల వద్ద నిరసన

అమలాపురం టౌన్, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): అమలాపురం పట్టణానికి చెందిన నిరుపేదలకు బోడసకుర్రులో అందించిన టిడ్కో గృహాల బ్యాంకు రుణాలను మాఫీ చేయాలని డిమాండు చేస్తూ సీపీఎం జిల్లా శాఖ ఆధ్వర్యంలో గృహ యజమానులు ఆదివారం నిరసన తెలిపారు. బలవంతపు వసూళ్లు తక్షణం ఆపాలని డిమాండ్ చేశారు. తొలుత టిడ్కో గృహ లబ్ధిదారులతో సమావేశం నిర్వహించారు. 20సంవత్సరాల పాటు ప్రతీ నెల రూ.4వేల నుంచి రూ.5వేలు చెల్లించాలని బ్యాంకు అధికారులు ఒత్తిడి తీసుకువస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. నిరసనలో సీపీఎం జిల్లా కన్వీనర్ కారెం వెంకటేశ్వరరావు, జిల్లా కమిటీ సభ్యులు నూకల బలరామ్, టి.నాగవరలక్ష్మి, స్థానికులు నూకరత్నం, సతీష్ పాల్గొన్నారు. టిడ్కో గృహాల వద్ద తాగునీటి సమస్యను పరిష్కరించాలని, డ్రైనేజీ వ్యవస్థను మెరుగు పరచాలని, ప్రతీ నెల విద్యుత్ బిల్లులు వచ్చేలా చూడాలని డిమాండ్ చేశారు.

భక్తి శ్రద్ధలతో కాలభైరవునికి పూజలు



అయినవిల్లి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఆదివారం కాలభైరవాష్టమి సందర్భంగా భక్తులు భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. ముక్తికాంత క్షణ ముక్తేశ్వరస్వామి ఆలయంలో క్షేత్రపాలకుడు కాలభైరవస్వామికి పూజలను వీరవల్లిపాలెం శ్రీసూర్యనారాయణమూర్తి సత్రం ఆధ్వర్యంలో నిర్వహించారు. లోక కల్యాణార్థం, గ్రహణశాంతి, ప్రపంచ శాంతి కోసం సత్రం ఫౌండర్, ఫ్యామిలీ మెంబర్ ముద్రగడ వెంకటసుబ్బారావు ఆధ్వర్యంలో పూజలు జరిపించారు. శైవాగమ పండితులు అల్లవరపు సుబ్రహ్మణ్య దీక్షితావధానుల ఆధ్వర్యంలో గణపతి పూజ, పుణ్యాహవచనం, మహన్యాసం, రుద్రాభిషేకం, లక్ష బిల్వార్చన జరిగాయి. ఆక్టోపస్ ఎస్పీ ముద్రగడ నాగేంద్రరావు, ముద్రగడ సీతారామవెంకట్రావు, ముద్రగడ గణేష్, ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

కూటమి పాలనలోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం


మాజీ జడ్పీటీసీలను సన్మానిస్తున్న జనసైనికులు

అల్లవరం, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): కూటమి పాలనలోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ఆశయ సాధనకు కృషి చేయాలని మాజీ ఏఎంసీ చైర్మన్, జనసేన నాయకుడు గునిశెట్టి చినబాబు అన్నారు. డి.రావులపాలెంలో తిక్కా శ్రీరామమూర్తి స్వగృహం వద్ద శ్రీరామమూర్తి అధ్యక్షతన జనసేన నాయకుల సమావేశం జరిగింది. చినబాబు, మాజీ జడ్పీటీసీ, సర్పంచ్ ఉండ్రు భగవాన్ దాస్‌ను సత్కరించారు. అన్నంనీడి మాచరరావు, జనసైనికులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా వనసమారాధన
మామిడికుదురు, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): మామిడికుదురులోని కేతన్ యోగా కుటుంబ సభ్యులు ఆదివారం వనసమారాధన కార్యక్రమాన్ని పెదపట్నం గ్రామం వైనతేయ నదీ తీరంలోని లంకలో ఘనంగా నిర్వహించారు. చిన్నా పెద్దా తేడా లేకుండా ఉల్లాసంగా ఉత్సాహంగా పాల్గొని సంహపంక్తి భోజనాలు చేశారు. ఈ సందర్భంగా చిన్నారులు, యువతులు చేసిన నృత్య ప్రదర్శనలు, థగ్ ఆఫ్ వార్, మ్యూజికల్ చైర్స్ ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో రాజస్థాన్ నుంచి విచ్చేసిన యోగా గురువు లేఖ్‌రాజ్ యోగా ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో యోగా గురువు కేతన్ ఆకుల, యోగ సాధక కుటుంబ సభ్యులు ఉల్లాసంగా ఉత్సాహంగా పాల్గొన్నారు.

ఆత్మీయ సమ్మేళనం
మామిడికుదురు, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): పెదపట్నంలంకలోని కొమ్ములవారి ఆత్మీయ సమ్మేళనం ఆదివారం ఘనంగా జరిగింది. కొమ్ముల ఇంటిపేరు కుటుంబ సభ్యులు ఒకచోట చేరి ఆనందోత్సాహాలతో గడిపారు. ప్రముఖ వైద్యులు శ్రీమన్నారాయణ, అనంతలక్ష్మి, ధన్వంతరీనాయుడు, రమణకుమార్, సునీత, అచ్యుతరామదాసు, కరుణాంబిక, మనోహర్‌నాయుడులను ఘనంగా సన్మానించారు. అనంతరం పలు సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు. వైసీపీ సీడబ్ల్యూసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి పాల్గొన్నారు.

మెకానిక్‌ల సంక్షేమానికి కృషి చేయాలి
ముమ్మిడివరం, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): మోటారు సైకిళ్ల మెకానిక్స్ సంక్షేమానికి ప్రభుత్వం ప్రత్యేక పథకాలు అమలుచేయాలని ముమ్మిడివరం శ్రీసిద్ధి వినాయక మోటారుసైకిల్ మెకానిక్ యూనియన్ సమావేశం డిమాండు చేసింది. ముమ్మిడివరంలో ఆదివారం బొక్కా వెంకటేశ్వరరావు అధ్యక్షతన మెటారుసైకిల్స్ మెకానిక్స్ యూనియన్ సమావేశం ఆదివారం జరిగింది. మోటారుసైకిల్స్ మెకానిక్‌లను చేతివృత్తివారిగా గుర్తించి, ప్రభుత్వం మెకానిక్స్ అవసరమయ్యే టూల్ కిట్లను రాయితీపై అందించాలని వారు కోరారు. సమావేశంలో దంగేటి రాంబాబు, టేకు వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

బాలికల వసతి గృహానికి టీవీ బహూకరణ



రాజోలు, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): రాజోలు సాంఘిక సంక్షేమశాఖ సమీకృత బాలికల వసతిగృహానికి బొంతు రాజు, అతని మిత్ర బృందం ఆర్థిక సాయంతో రూ.25వేలు విలువైన ఎల్‌జీ స్మార్ట్ టీవీని సమకూర్చగా ఎంపీపీ కేతా శ్రీను వార్డెన్ డి.జ్యోతికి ఆదివారం అందజేశారు. టీవీని బహూకరించిన రాజు, అతని మిత్ర బృందానికి వార్డెన్ జ్యోతి, బాలికలు కృతజ్ఞతలుతెలిపారు.

గోడను ఢీకొట్టిన కారు
ముమ్మిడివరం, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): సీహెచ్ గున్నేపల్లిలో వేపచెట్టు వనువులమ్మ గుడి వద్ద ఒక కారు ఓ ఇంటి గోడను ఢీకొట్టింది. దీంతో ఆ ఇంటి గోడ ధ్వసమవడంతో పాటు కారు ముందరి భాగం నుజ్జునుజ్జు అయింది. అయితే కారులో ఉన్న వారికి పెద్దగా ప్రమాదం జరగలేదు.

ప్రారంభమైన క్రిస్మస్ వేడుకలు


అడ్డాలపాలెం వంతెన వద్ద విద్యుత్ అలంకరణతో ఏర్పాటుచేసిన క్రిస్మస్ ట్రీ, పశువుల శాల

అంతర్వేది, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): సఖినేటిపల్లి మండలంలో క్రిస్మస్ వేడుకలు అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. సఖినేటిపల్లి, రామేశ్వరం, అంతర్వేది, కేశవదాసుపాలెం, మోరి, అంతర్వేదిపాలెం, వీవీమెరక, మోరిపోడు గ్రామాల్లో చర్చిలు, ప్రార్థనాల మందిరాల్లో క్రిస్మస్ స్టార్లు ఏర్పాటు చేశారు. ప్రార్థనా మందిరాలను విద్యుద్దీపాలతో అలంకరించారు. అలాగే అడ్డాలపాలెంలో క్రిస్మస్ ట్రీ, పశువుల శాలలను రంగురంగుల విద్యుద్దీపాలతో ముస్తాబు చేశారు. అంతర్వేదిపాలెంలోని ప్రార్థనా మందిరాల వద్ద క్రిస్మస్ వేడుకల్లో భాగంగా దైవజనుల సందేశాలిస్తూ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తున్నారు. డిసెంబరు నెలలో క్రిస్మస్ వేడుకలు ప్రారంభమై జనవరి 1, 2 తేదీల వరకు జరుగుతాయి. క్రీస్తు పుట్టిన నెల కావడంతో క్రైస్తవులు క్రిస్మస్ ఆరాధనల్లో పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు చేపడతారు.

హైందవ శంఖారావానికి తరలిరావాలి
అంబాజీపేట, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): విజయవాడలో జనవరి 5న నిర్వహించే హైందవ శంఖారావ కార్యక్రమానికి హిందువులంతా అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని ఆర్ఎస్ఎస్ ప్రచారక్ పి.విద్యాసాగర్ పిలుపునిచ్చారు. కముజువారిలంక శ్రీరామపురంలో నిర్వహించిన విశ్వహిందూ పరిషత్ ధర్మప్రచారక్ సమావేశంలో ఆయన మాట్లాడారు. సనాతన ధర్మాన్ని కాపాడే విధంగా ప్రతి హిందూ కృషిచేయాలన్నారు. సమావేశంలో ధర్మప్రచారక్ కడలి వెంకటేశ్వరరావు, వాసంశెట్టి పల్లంశెట్టి, గుబ్బల సత్యనారాయణ, కముజు ప్రసాద్, బొక్కా రామకృష్ణ పాల్గొన్నారు.

శంఖారావాన్ని విజయవంతం చేయాలి
యానాం, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): విజయవాడలో జనవరి5న నిర్వహించనున్న హైందవ శంఖారావం భారీ బహిరంగ సభకు హిందూ బంధువులందరూ తరలివచ్చి విజయవంతం చేయాలని ఆర్ఎస్ఎస్ ప్రతినిధులు కోరారు. యానాం యర్రాగార్డెన్స్‌లోని జ్ఞానమందిరంలో ఆదివారం నిర్వహించిన హిందు సమ్మేళనం సమావేశంలో యానాం, తాళ్లరేవుకు చెందిన ఆర్ఎస్ఎస్ ప్రతినిధులు పాల్గొన్నారు.


రోడ్డు ప్రమాదంలో డ్రైవర్‌కు గాయాలు
రాజోలు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): శివకోడు బైపాస్ రోడ్డులో శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో కారు డ్రైవర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం నూతనంగా నిర్మించిన శివకోడు బైపాస్ రోడ్డులో చిన్నోడు బ్రాందీషాపు సమీపంలో సఖినేటిపల్లి నుంచి రాజమహేంద్రవరం వెళుతున్న కారు అతివేగంగా ప్రయాణించడంతో జాతీయ రహదారి 216పై అధికారులు ఏర్పాటుచేసిన బోర్డును, కిలోమీటరు దిమ్మను బలంగా ఢీకొట్టడంతో పల్టీ కొట్టింది. దీంతో కారులో ఉన్న డ్రైవరు స్వల్ప గాయాలతో బయటపడ్డారు.

పరిశ్రమను దరియాలతిప్పకు తరలించాలని కోరతా
యానాం, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): రీజెన్సీ పరిశ్రమను దరియాలతిప్పకు తరలించాలని ప్రభుత్వాన్ని కోరనున్నట్లు పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు తెలిపారు. ప్రస్తుతం మూతపడిన పరిశ్రమ చుట్టూ కాలనీలు, నివాస ప్రాంతాలు ఏర్పడ్డాయని, నూతన పరిశ్రమ ఏర్పాటుకు దరియాలతిప్పలో అనుమతి ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరతానన్నారు. రీజెన్సీ యాజమాన్యానికి దరియాలతిప్పలో వంద ఎకరాలు భూమి ఉండటంతో, దశలవారీగా తరలించి యానాం వాసులకు యాభైశాతం ఉద్యోగా అవకాశాలు ఇస్తే యాజమాన్యం ప్రభుత్వానికి ఉన్న బకాయిలు రద్దు చేసినా ఎవరికీ అభ్యంతరం ఉండబోదన్నారు. యాజమాన్యం ప్రతినిధి గత అసెంబ్లీ ఎన్నికల్లో సీఎంకు వ్యతిరేకంగా పనిచేసినా పరిశ్రమ విషయంలో తాను అభ్యంతరం చెప్పనందుకు సీఎం పరిశ్రమకు రాయితీలు కల్పించేందుకు సహకరిస్తున్నారని మల్లాడి అన్నారు.

సహజవాయువు మంజూరుకు సహకరించాలి: జీఎస్ నాయుడు

రీజెన్సీ పరిశ్రమలో టైల్స్ ఉత్పత్తి సమయంలో కాలుష్యం వెలువడకుండా ఉండేందుకు సహజవాయువు అవసరమని, దీనికి సాధనకు పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు, స్థానిక ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్‌లు సహకరించాలని తాను కోరుతున్నట్లు సంస్థ చైర్మన్ డాక్టర్ జీఎస్ నాయుడు అన్నారు. హైదరాబాదు నుంచి మీడియాకు విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. ప్లాంటు సిద్ధం చేసుకుంటే సహకరిస్తానని పుదుచ్చేరి సీఎంహామీ ఇచ్చిన మేరకే యానాంలో పరిశ్రమను ప్రారం భించేందుకు బాగు చేయిస్తున్నానన్నారు. 25ఏళ్ల యానాంలో పరిశ్రమ నిర్వహించిన తర్వాత, ఇప్పుడు పరిశ్రమను దరియాలతిప్పకు తరలించాలని చెప్పడం భావ్యం కాదన్నారు. యానాంలో పరిశ్రమ ప్రారంభించకుండా చేస్తున్న ప్రయత్నామా అని ఆయన ప్రశ్నించారు. తాను రాజకీయాలకు అతీతమని, తనను రాజకీయాల్లోకి లాగుతున్నారన్నారు. పరిశ్రమను ప్రారంభించేందుకు యానాం చాంబర్ ఆఫ్ కామర్స్ ఆధ్వర్యంలో 17సమావేశాలు సీఎం స్థాయిలో నిర్వహించినా ప్రయోజనం లేకుండా పోయిందన్నారు.

పాఠశాలకు ప్యూరిఫైడ్ వాటర్ ఫిల్టర్ అందజేత



అమలాపురం రూరల్, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): సాకుర్రు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థుల కోసం దాతలు వేదుల విశ్వనాథం కుటుంబ సభ్యులు, నక్కా సోమేశ్వరరావు దంపతులు, కొలిశెట్టి కుమార్‌తో పాటు గ్రామపెద్దలు రూ.75వేలు విలువైన ప్యూరిఫైడ్ వాటర్ ఫిల్టర్‌ను అందించారు. కార్యక్రమంలో సర్పంచ్ గుత్తుల చిరంజీవిరావు, వైస్ ఎంపీపీ పొలమూరి బాలకృష్ణ, ముత్తాబత్తుల వెంకటరమణ, చొల్లంగి సోమిశెట్టి, హెచ్ఎం పుచ్చకాయల బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి రెవెన్యూ సదస్సులు
అంబాజీపేట, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి):మండలంలో రెవెన్యూ సదస్సులు ఈనెల10వ తేదీ నుంచి నిర్వహిస్తున్న తహశీల్దారు జె.వెంకటేశ్వరి తెలిపారు. 10న ఇరుసుమండ, 11న పుల్లేటికుర్రు, 12న కె.పెదపూడి, 13న గంగలకుర్రు, గంగలకుర్రు అగ్రహారం, 17,18 తేదీల్లో మాచవరం, 19న ఇసుకపూడి, 20న చిరతపూడి, 21ననందంపూడి, 24న తొండవరం, వాకలగరువు, 26న పసుపల్లి, 27న ముక్కామల, 28న వక్కలంక, 31న మొసలపల్లిలో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తామన్నారు. ఈసదస్సుల్లో భూసమస్యలు పరిష్కరిస్తామన్నారు.

వాతావరణ మార్పుతో రైతుల్లో ఆందోళన



రావులపాలెం మండలంలో కోత దశలో ఉన్న వరిపంట

రావులపాలెం, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): కష్టపడి పండించిన పంట చేతికి అందివచ్చే సమయంలో వాతావరణ మార్పులతో అన్నదాతల ఆశలు ఆవిరవుతున్నాయి. మండలంలో ఖరీఫ్ పంట కోతదశలో ఉన్నాయి. ఇటీవల స్వర్ణ రకం కోతలు పూర్తికాగా 1318 రకం కొంతమేర పూర్తయ్యాయి. యంత్రాలతో ధాన్యాన్ని కోసి ఒబ్బిడి చేసే పనిలో రైతులు తలమునకలవుతున్న తరుణంలో వాతావరణంలో వస్తున్న మార్పులు రైతులను ఆందోళనకు గురి చేస్తున్నాయి. ఆదివారం సాయంత్రం పలుచోట్ల చిరుజల్లులు పడటంతో చేతికి అందివచ్చిన పంట దక్కకుండా పోతుందోమోనని రైతులు మరింత ఆందోళన చెందుతున్నారు. ఇటీవల ఫెంగల్ తుఫాన్ కారణంగా కురిసిన వర్షాల వల్ల వరి కోతలు ఆలస్యమయ్యాయి. ఇప్పుడు కోతకు సిద్ధమవుతున్న సమయంలో మళ్లీ తుపాను హెచ్చరికలతో రైతుల్లో ఆందోళన నెలకొంది.

వెంకన్న ఆలయానికి భక్తుల రద్దీ

ఆత్రేయపురం, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయానికి ఆదివారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో రద్దీనెలకొంది. నోము ఆచరిస్తున్న భక్తులు స్వామివారికి అష్టోత్తర పూజలు, నిత్య కల్యాణాలు జరిపారు. అధిక సంఖ్యలో భక్తులు అన్న ప్రసాదంలో పాల్గొన్నారు. వకుళమాత అన్నదాన భవన నిర్మాణానికి రాజమహేంద్రవరానికి చెందిన డాక్టర్ యల్లమర్తి రవిశంకర్, లక్ష్మీచైతన్య దంపతులు రూ.1,52,257 విరాళం అందించారు. ఆదివారం వివిధ సేవల ద్వారా ఒకరోజు ఆదాయం రూ.4,19,956 వచ్చినట్టు ఉపకమీషనరు, ఈవో నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు.



విరాళం ఇచ్చిన దాతకు స్వామివారి చిత్రపటం అందిస్తున్న ఉప కమిషనరు



సేఫ్టీ సిలెండర్ కిట్లు పంపిణీ చేస్తున్న మంత్రి సుభాష్

ఎంఎస్ఎంఈతో నిరుద్యోగులకు ఉపాధి కల్పన

మంత్రి సుభాష్

రామచంద్రపురం(ద్రాక్షారామ), డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): నిరుద్యోగులకు సూక్ష్మ, మధ్య, చిన్నతరహా పరిశ్రమల (ఎంఎస్ఎంఈ) ద్వారా ఉపాధి అవకాశాల కల్పిస్తున్నామని రాష్ట్ర కార్మిక శాఖా మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. శ్రీకరి ఇన్నోవేషన్స్ అండ్ ఇంప్లిమెంటేషన్ కంపెనీలో పరీక్ష ఆధారంగా ఉత్తీర్ణులైన గ్రూపు ఫెసిలిటేటర్స్‌కు ఆదివారం మంత్రి సేఫ్టీ సిలెండర్లు పంపిణీ చేశారు. మంత్రి మాట్లాడుతూ ఫెసిలిటేటర్లుగా ఎంపికైన వారు ఎంఎస్ఎంఈ పరిశ్రమల్లో పలు అంశాలపై తనిఖీ చేసి క్వాలిటీ కంట్రోల్ ఆఫ్ ఇండియాకు నివేదిక పంపిస్తారన్నారు. నిరంతర తనిఖీల ద్వారా పరిశ్రమల్లో ప్రమాదాలు జరగకుండా ముందస్తు నివారణ చేయవచ్చని అన్నారు. కార్యక్రమంలో పరిశ్రమల శాఖ జనరల్ మేనేజరు పీకేపీ ప్రసాద్, శ్రీకరి ఇన్నోవేషన్స్ మేనేజింగ్ డైరెక్టరు టీవీఎస్ వినోద్ కుమార్, ప్రాజెక్టు ఇన్‌చార్జి సయ్యద్ చాన్‌బాబు, ప్రాజెక్టు మేనేజర్లు హేమంత్‌కుమార్, రాచూరి వెంకటేష్, అడ్మిన్ సాగర్ పాల్గొన్నారు.

ఎన్ఎంఎంఎస్ పరీక్ష ప్రశాంతం

రామచంద్రపురం పట్టణంలో ఆదివారం ఎన్ఎంఎంఎస్ పరీక్ష ప్రశాంతంగా జరిగింది. రామచంద్రపురం డివిజన్‌లో 712 మంది విద్యార్థులకు 697 మంది హాజరయ్యారు. రత్నంపేట మున్సిపల్ ఉన్నత పాఠశాలలో 235 మంది, చింతపల్లి సూరన్ననగర్ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో 229 మంది, కృత్తివెంటి పేర్రాజు పంతుల ప్రభుత్వ జాతీయోన్నత పాఠశాలలో 233 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. పరీక్ష కేంద్రాలను ఏఎంవో పి.రాంబాబు, ఎంఈవో ఎం.శ్రీనివాస్ పర్యవేక్షించారు.

నేటి నుంచి ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమ్మెబాట



సమ్మెకు సిద్ధమవుతున్న మున్సిపల్ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు

మండపేట, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): తమ నేటి నుంచి సమ్మెబాట పడుతున్నామని మున్సిపల్ ఔట్ సోర్సింగ్ ఉద్యోగ సంఘ ప్రతినిధులు తెలిపారు. ఆదివారం వారు ఒక ప్రకటన విడుదల చేశారు. టెక్నికల్, నాన్ టెక్ని కల్ ఉద్యోగులకు రూ.29,200, నాన్ టెక్నికల్ ఉద్యోగులకు రూ.24,500 వేతనం ఇవ్వా లని వారు డిమాండ్ చేశారు. పదిహేను సంవత్స రాలు సర్వీసు పూర్తి చేసిన ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు సర్వీస్ రూల్స్ ద్వారా క్రమబద్ధీ కరించాలని కోరారు. జాతీయ, రాష్ట్ర పండుగలకు సెలవులు వర్తింపచేయాలన్నారు. విధి నిర్వహణలో మరణించిన ఉద్యోగికి రూ.10 లక్షల నష్టపరిహారం, ప్రమాదంలో వైకల్యం కలిగితే రూ.5 లక్షలు చెల్లించాలని కోరారు. రాష్ట్ర సంఘం పిలుపు మేరకు సోమవారం నుంచి నిరవధిక సమ్మె చేస్తున్నామని వారన్నారు. ప్రకటన విడుదల చేసిన వారిలో సుబ్బారావు, లీలాకృష్ణ ఉన్నారు.

స్ఫూర్తినింపిన సంఘం శరణం గచ్ఛామి

రామచంద్రపురం(ద్రాక్షారామ), డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): రామచంద్రపురం కృత్తివెంటి పేర్రాజు పంతులు జాతీయోన్నత పాఠశాలలో ఆదివారం రాత్రి ప్రదర్శించిన సంఘం శరణం గచ్ఛామి నాటకం ఉత్కంఠభరితంగా సాగింది. హైదరాబాద్ అభ్యుదయ ఆర్ట్స్ ప్రదర్శించిన అంబేడ్కర్ జీవిత చరిత్ర స్ఫూర్తి నింపేలా ప్రదర్శించారు. స్వాతంత్రం ముందు గాంధీ మహాత్ముడితో అంబేడ్కర్ మధ్య సన్నివేశాలు, మొదటి రౌండ్ టేబుల్ సమావేశాలను ఆసక్తిగా తిలకించారు. స్వాతంత్ర సముపార్జన, రాజ్యాంగం రూపకల్పనలో అంబేడ్కర్ పాత్ర స్ఫూర్తిదాయకంగాసాగింది. పట్టణ ప్రముఖులు, దళిత నాయకులు హాజరై ఆసక్తిగా తిలకించారు.

అంబేడ్కర్‌కు నివాళి:

అంతకు ముందు అం బేడ్కర్ చిత్రపటానికి ట్రేడ్ యూనియన్ నాయకుడు డాక్టర్ స్టాలిన్, పారిశ్రామికవేత్త అడ్డూరి జగన్నాథవర్మ, బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు పిల్లి మురళి, వాడ్రేవు సాయిప్రసాద్, న్యాయవాదులు, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్, టీడీపీ సీనియర్ నాయకుడు, మంత్రి సుభాష్ తండ్రి సత్యం, సర్పంచ్‌లు అంబటి తుకారం, పోలినాటి ప్రసాద్ తదితరులు నివాళులర్పించారు. కార్యక్రమాన్ని దళిత ఐక్యవేదిక నాయకులు, పీడీఎస్‌యు సహాయ కార్యదర్శి బి.సిద్దూ, న్యాయవాది గాలంకి చిట్టిబాబు పర్యవేక్షించారు.



సంఘం శరణం గచ్ఛామి నాటకంలో సన్నివేశం

ఘనంగా శ్రీనివాసుడి కల్యాణం

మండపేట, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి) పట్టణంలోని బూరుగుంట సీతారామ క్షేత్రంలో శనివారం రాత్రి శ్రీనివాసుడి కల్యాణాన్ని భక్తి శ్రద్ధలతో జరిపారు. అర్చకుడు ఎం.సీతారామాచార్యులు, ఆలయ అర్చకులతో పట్టణానికి చెందిన వాసవి సప్లయి కంపెనీ నిర్వాహకుడు రాంబాబు కుటుంబ సభ్యులతో కల్యాణ కార్యక్రమాలు జరిపారు.

కడుపునింపని గంపల అల్లకం

ప్లాస్టిక్, ఇనుముతో ఉపాధి కోల్పోతున్న మేదర్లు

కొనేవారు లేక నష్టపోతున్న కార్మికులు



మేదర్ల తయారు చేస్తున్న గంపలు

రావులపాలెం, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): తాతల కాలం నాటి నుంచి గంపల విక్రయాలతో జీవనం సాగిస్తున్నా కడుపు నిండటం లేదని కార్మికులు వాపోతున్నారు. వివిధ పనులకు ఉపయోగించే వీటి స్థానంలో ఇనుప గంపలు, ప్లాస్టిక్ టబ్బుల రాకతో తమకు ఉపాధి లేకుండా పోతోందని వారు ఆవేదన చెందుతున్నారు. జిల్లా ప్రధాన కేంద్రాలతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో కూడా బుట్టలు, చాపలు, గంపలు వంటివి తయారుచేసి వాటి విక్రయాలతో ఉపాధి పొందేవారు. తాటి చెట్ల నుంచి కమ్మలను సేకరించి ఎంతో నైపుణ్యంతో తయారు చేస్తామని కార్మికులంటున్నారు. ఒకప్పుడు గంపలు అల్లేందుకు అవసరమైన సామగ్రిని రైతులు ఉచితం గా ఇచ్చేవారని కార్మికులు అంటున్నారు. ప్రస్తుతం వాటిని కూడా కొనుగోలు చేయాల్సి వస్తున్నదని వారు వాపోతున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు మూడు నుంచి ఐదు గంపలు సిద్ధం అవుతాయన్నారు. మార్కెట్ రేటును బట్టి రూ.200 నుంచి రూ.400 వరకు విక్రయిస్తామని తెలుపుతు న్నారు. రైతుల ఆర్డర్లను బట్టి గంపలు, తట్టలు తయారు చేస్తామన్నారు. మిగిలిన గంపలను మార్కెట్లో విక్రయిస్తూ ఉపాధి పొందుతామన్నారు. ఇటీవల ఐరన్, ప్లాస్టిక్ గంపలు రావడంతో తమ ఉపాధికి గండిపడుతోందని కార్మికులు వాపోతున్నారు. తమ కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని వారు కోరుతున్నారు.



రావులపాడు వద్ద గంప అల్లుతున్న దృశ్యం



క్విజ్ పోటీల్లో సిద్ధార్థ విద్యార్థులకు సైకిళ్లను అందిస్తున్న డీఈవో షలీంబాషా

రిలయన్స్ క్విజ్ పోటీల్లో సిద్ధార్థ విద్యార్థుల ప్రతిభ

కొత్తపేట, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): రిలయన్స్ ధీరూబాయ్ అంబానీ క్విజ్ పోటీల్లో కొత్తపేట సిద్ధార్థ స్కూల్ విద్యార్థులు ప్రతిభ చూపారని పాఠశాల కరస్పాండెంట్ ఏవీవీ సత్యనారాయణ తెలిపారు. అమలాపురంలో నిర్వహించిన ఈ పోటీల్లో తమ పాఠశాలకు చెందిన ఎస్.ఈశ్వర్, పి.చందనలకు డీఈవో షలీంబాషా నుంచి సైకిళ్లను బహుమతిగా అందుకున్నారు. ప్రతిభ చూపిన విద్యార్థులను కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అభినందించారు.



జేసీ అకాడమీలో జరిగిన భగవద్గీత పోటీల్లో విజేతలతో నిర్వాహకులు

ఆకట్టుకున్న భగవద్గీత శ్లోకాల పోటీలు

మండపేట, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): మండపేటలోని జేసీ అకాడమిలో ఆదివారం భగవద్గీత శ్లోకాల పోటీలు జరిగాయి. ఈ పోటీలను టీటీడీ రాజమహేంద్రవరంశాఖ ధర్మప్రచార పరిషత్ ప్రోగ్రాం కమిటీ అధికారి ఓరుగంటి నరసింహ యోగి పర్యవేక్షణలో జరిపారు. ఈ పోటీల్లో సీనియర్, జూనియర్ విభాగాల్లో 20 మంది వరకు పాల్గొన్నారు. మహిళా విభాగంలో కొత్తపేటకు చెందిన ఎస్.భార్గవి ప్రథమ, ద్వితీయ బహుమతిని మండపేటకు చెందిన ఎన్.రమాదేవి, తృతీయ బహుమతి, ఎన్.నాగలక్ష్మి, అమలాపురం, బాలికల విభాగంలో ప్రథమస్థానం, ఎం.దీక్షిత, కొత్తపేట, ద్వితీయ, టీ.లక్ష్మీప్రియ, తృతీయ ఎస్.స్కంధ, రావులపాలెం విజేతలుగా నిలిచారని నిర్వాహకులు తెలిపారు. పోటీల్లో న్యాయ నిర్ణేతలుగా టీ.శ్రీలక్ష్మీ, గుణ్ణం పద్మ, వి.వాసంతి వ్యవహరించారు. విజేతలకు దేవస్థానం తరపున టీటీడీ పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో జేసీ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.



సత్యనారాయణ చౌదరి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి సుభాష్

మంత్రి పరామర్శ

రామచంద్రపురం(ద్రాక్షారామ), డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): పితృ వియోగం పొందిన టీడీపీ పట్టణ అధ్యక్షుడు కడియాల రాఘవన్‌ను ఆదివారం మంత్రి వాసంశెట్టి సుభాష్ పరామర్శించారు. రాఘవన్ తండ్రి విశ్రాంత అధ్యాపకుడు కడియాల సత్యనారాయణ చౌదరి ఇటీవల మృతి చెందారు. ఆయన చిత్రపటం వద్ద మంత్రి సుభాష్, మాజీ కౌన్సిలరు దంగేటి గౌరీశంకర్, కూటమి నాయకులు నివాళులర్పించారు.



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

హైందవ శంఖారావానికి తరలిరండి

రామచంద్రపురం(ద్రాక్షారామ), డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): వచ్చేనెల 5న విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో జరిగే హైందవ శంఖారావానికి తరలిరావాలని వీహెచ్‌పీ, ఆర్ఎస్ఎస్ నాయకులు పిలుపునిచ్చారు. ఆదివారం శివాలయం వీధిలో కనకదుర్గ ఆలయ ప్రాంగణంలో హైందవ శంఖారావం కరపత్రాలు ఆవిష్కరించారు. కార్యక్రమానికి హిందువులు వేలాదిగా తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రామచంద్రపురం ఖండ కన్వీనర్ గణేష్ శర్మ, ఆర్ఎస్ఎస్ ప్రతినిధి హనుమంతరావు, నేమాని శర్మ, డాక్టర్ కోట నాగసతీష్, రాఘవేంద్ర, బీజేపీ నాయకులు కొట్టువాడ హరిబాబు, సలాది సతీష్‌నాయుడు, సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

ఆత్రేయపురం, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): ఇటీవల పురుగుల మందు తాగిన ఘటనలో ఒకవ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్ఐ ఎస్.రాము తెలిపారు. ఆత్రేయపురం గ్రామానికి చెందిన వారా తాతారావు(44) ఈ నెల 4న పురుగుల మందు తాగాడు. అనారోగ్యంతో పాటు కుటుంబ సమస్యలపై మనస్తాపానికి గురై 4న పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఆసుపత్రి సమాచారం మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

టీడీపీ సభ్యత్వ నమోదు వేగవంతం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బండారు సత్యానందరావు

రావులపాలెం, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): టీడీపీ సభ్యత్వ నమోదును వేగవంతం చేయాలని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు నాయకులకు నిర్దేశించారు. రావులపాలెం పార్టీ కార్యాలయం వద్ద ఆదివారం రాత్రి ఆయన ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశానికి నియోజకవర్గ పరిశీలకులు వాసిరెడ్డి రాంబాబు, తెలుగు రైతు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆకుల రామకృష్ణ పాల్గొన్నారు. సభ్యత్వం నమోదు చేసుకోవడం ద్వారా రూ.5లక్షల ప్రమాద బీమా, పిల్లల చదువులకు ఆర్థికసాయం, నైపుణ్య శిక్షణ, ఉపాధి అవకాశాలు వంటి ప్రయోజనాలు కలుగుతాయన్నారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు..

బ్రాహ్మణ వెల్ఫేర్ కార్పొరేషన్‌కు నిధులు కేటాయింపుపై హర్షం



పాలాభిషేకం చేస్తున్న బ్రాహ్మణ సంఘ నాయకులు

కొత్తపేట, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): ఏపీ బ్రాహ్మణ వెల్ఫేర్ కార్పొరేషన్‌కు ప్రభుత్వం రూ.200 కోట్లు కేటాయించడంపై కొత్తపేట మండల బ్రాహ్మణ సంఘం హర్షం వ్యక్తం చేశారు. చిలకమర్తి శ్రీనివాస్ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి లోకేశ్‌లకు, నిధులకు కృషి చేసిన బ్రాహ్మణ సాధికారిత సమితి కన్వీనర్ బుచ్చి రాంప్రసాద్‌కు వారు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో అబ్బరాపు సుబ్బారావు, కీర్తి మూర్తి, ఆచంట విద్యాసాగర్, వేమవరపు రామకృష్ణ, పి.రవి, పైడిమర్రి శ్రీనివాసప్రసాద్, ఈమని విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.



సంస్థ ప్రతినిధుల నుంచి ల్యాప్‌ట్యాప్‌లు అందుకుంటున్న విద్యార్థులు

రిలయన్స్ క్విజ్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

మండపేట, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి) రిలయన్స్ క్విజ్ పోటీల్లో గౌతమి మున్సిపల్ హైస్కూల్ విద్యార్థులు సత్తా చాటారు. గౌతమి పాఠశాలకు చెందిన పదిమంది విద్యార్థులు ల్యాప్‌ట్యాప్‌లు గెల్చుకున్నారు. ఇటీవల జరిపిన క్విజ్ పోటీల్లో రెండు ల్యాప్‌ట్యాప్‌లను పాఠశాల విద్యార్థినులు గీతశ్రీ, దీక్షిత గెలుపొందారని ఉపాధ్యాయులు తెలిపారు. విద్యార్థులకు శిక్షణ ఇచ్చిన ఉపాధ్యాయులు రామచంద్రారెడ్డి, విద్యార్థులను తూర్పు గోదావరి జిల్లా విద్యాధికారి కె.వాసుదేవరావు, మండపేట విద్యాధికారులు, నాయుడు రామచంద్రరావు, సోమిరెడ్డి, రాష్ట్ర జేవీవీ మాజీ అధ్యక్షులు డాక్టర్ చల్లా రవికుమార్, స్వామి ప్రసాద్, పాఠశాల హెచ్ఎం సూర్యలత తదితరులు అభినందించారు.

నిత్యాన్న దానానికి బియ్యం బస్తాల విరాళం

అంతర్వేది, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఆదివారం స్వామివారి దర్శనం అనంతరం నిత్యాన్నదాన ట్రస్టుకు భీమవరానికి చెందిన ఆకుల అభిజిత్ రూ.40వేలు విలువైన 26బియ్యం బస్తాలను విరాళంగా అందించారు. దాతకు ఆలయ సహాయ కమిషనర్ వి.సత్యనారాయణ స్వామివారి చిత్రపటం, ప్రసాదం అందించారు. కార్యక్రమంలో కిరణ్, అన్నదానం స్వామి తదితరులు పాల్గొన్నారు.



స్వామివారి చిత్రపటం అందిస్తున్న దృశ్యం

రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోండి

కొత్తపేట, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): మండలంలో ఈ నెల 10 నుంచి 28 వరకు జరిగే రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని తహశీల్దారు వై.రాంబాబు కోరారు. సదస్సులో సెక్షన్ 22(ఏ) కేసులు, సర్వే సమస్యలు, దేవదాయ ధర్మదాయ భూసంబంధ వివాదాలు తదితర సమస్యలను పరిష్కరించుకోవాలని కోరారు. మంగళవారం వానపల్లి, 11న వాడపాలెం, 12న మందపల్లి, 13న గంటి, 17న కండ్రీగ, 18న మోడేకుర్రు, 19న పలివెల, 20న అవిడి, 21న బిళ్లకుర్రు, 28న కొత్తపేట గ్రామాల్లో ఉదయం 9 గంటల నుంచి సదస్సులు నిర్వహిస్తామన్నారు.

రాయపూర్‌కు తరలిన స్వామివారి విగ్రహం



మారేడుబాకలో తయారు చేసిన వేంకటేశ్వరస్వామి విగ్రహం

మండపేట, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): మారేడుబాకకు చెందిన కళాకారుడు వాసా శ్రీనివాసరావు 60 కిలోల ఇత్తడితో చేసిన 5.9 అడుగుల శ్రీవేంకటేశ్వరస్వామి విగ్రహాన్ని ఆదివారం రాయ్‌పూర్ తీసుకువెళ్లారు. రాయ్‌పూర్ రైల్వేస్టేషన్‌లో శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయం ఏర్పాటు చేసి 25 ఏళ్లయిన నేపథ్యంలో అక్కడ స్వామివారి ఆలయ ప్రాంగణంలో బాలాజీ సేవా సమితి ఆధ్వర్యంలో ఆలయ ట్రస్టీ శ్రీనివాసరావు ఆర్డర్ మేరకు స్వామివారి విగ్రహంతోపాటు చుట్టూ ఉండే తొడుగును కూడా తయారు చేశామని కళాకారుడు శ్రీనివాసరావు తెలిపారు. ఆదివారం బాలాజీ సేవా సమితి నిర్వాహకులు ఈ విగ్రహాన్ని రాయ్‌పూర్‌కు తీసుకువెళ్లారు.

టైలర్స్ అసోసియేషన్ కార్యవర్గ ఎన్నిక



టైలర్స్ అసోసియేషన్ నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకారం దృశ్యం

ఆలమూరు, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): కోనసీమ జిల్లా బాలయోగి టైలర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గ ఎన్నిక పెదపళ్లలో జరిగిన జిల్లా సమావేశంలో ఏకగ్రీవంగా జరిగింది. జిల్లా అధ్యక్షుడిగా మండలానికి చెందిన జక్కంశెట్టి స్వామి ఎన్నికయ్యారు. అనంతరం నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం చేశారు. అధ్యక్షుడిగా జక్కంశెట్టి స్వామి, ఉపాధ్యక్షుడిగా వాకా భాస్కరరావు, ప్రధాన కార్యదర్శి డి.సత్యనారాయణమూర్తి, ట్రెజరర్‌గా మట్టపర్తి రాంబాబుతోపాటు పలువురు సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. జిల్లా నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారానికి రాష్ట్ర సంఘ నాయకులు పి.మల్లికార్జునరావు, కడలి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులను నియమించాలి

రావులపాలెం, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): హిందీ ఉపాధ్యాయులను నియమించాలని రాష్ట్ర భాషోపాధ్యాయ అధ్యక్షుడు బి.సాయిబాబా అన్నారు. రావులపాలెం జడ్పీ పాఠశాలలో ఆదివారం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా భాషోపాధ్యాయ సంఘ సమావేశం రాష్ట్ర అధ్యక్షుడు సాయిబాబా అధ్యక్షతన జరిపారు. సమావేశంలో వక్తలు ఉపాధ్యాయుల సమస్యలపై మాట్లాడారు. అనంతరం కోనసీమ జిల్లా కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షులుగా ఊబలంక హైస్కూల్ తెలుగు ఉపాధ్యాయులు పావులూరి సూర్యనారాయణమూర్తి, ప్రధాన కార్యదర్శిగా మోరి జడ్పీ పాఠశాల హిందీ ఉపాధ్యాయుడు గానాల లక్ష్మీనరసింహచార్యులు, మహిళా కార్యదర్శిగా కేశవరం పాఠశాల తెలుగు ఉపాధ్యాయురాలు శ్రీపాద సీతామహాలక్ష్మి సత్యవేదవేగమాంబలను ఎన్నుకున్నారు. వీరిని పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు సత్కరించారు.

నేటి నుంచి సీతారామ క్షేత్రంలో సప్తాహం

మండపేట, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): ఈనెల 13న జరిగే హనుమాన్ జయంతిని పురస్కరించుకుని బూరుగుంట చెరువు వద్ద వున్న సీతారామ క్షేత్రంలో నేటి నుంచి 17 వరకు శ్రీరామనామయుక్త, చాలిసా సప్తాహ మహోత్సవాన్ని నిర్వహిస్తున్నట్టు ఆలయ నిర్వాహకులు తెలిపారు. నేడు శ్రీరామనామ ఏకాహం, 10న హనుమాన్‌చాలీసా సప్తాహం, 11న గీతా జయంతి స్వామివారికి పంచామృత అభిషేకం, 12న సీతారాములకు ప్రత్యేక స్వర్ణ పుష్పార్చన, 13న ఆంజనేయస్వామికి సింధూర పూజ, తమలపాకు పూజ, 13, 14, 15, 16 తేదీల్లో నగర సంకీర్తన, 16న ధనుర్మాసం ప్రారంభం సందర్భంగా సీతారాములకు అభిషేకం, 17న ఆలయంలో వేంకటేశ్వరస్వామి కల్యాణం, అనంతరం, సప్తాహ బృందాలకు అభినందన కార్యక్రమం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. సప్తాహంలో ఐదు భక్త బృందాలు పాల్గొంటాయని వారు తెలిపారు. భక్తులు సప్తాహ కార్యక్రమాలు, హనుమాన్ వ్రత పూజల్లో పాల్గొని స్వామివారి తీర్థ ప్రసాదాలను స్వీకరించాలని నిర్వాహకులు తెలిపారు.